
ఆంధ్రజ్యోతి

ఉష్ణోగ్రతలు గరిష్టం : 34.0 । కనిష్టం : 19.0

ANDHRAJYOTHY

3



జోగులాంబ గద్వాల జిల్లా వార్తలు

శనివారం 8 మార్చి 2025

కొనసాగుతున్న శ్రీరంగనాయకస్వామి ఉత్సవాలు 4

రంజాన్ వేళలు

ఇఫ్తార్(శనివారం-6:30)

సహర్ (ఆదివారం-5:07)



అంకిరావుపల్లి గ్రామం దారిలో దోపిడీకి పాల్పడ్డ ఘటనా ప్రదేశాన్ని పరిశీలిస్తున్న సీఐ మహేష్

దొంగల హల్‌చల్

» రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టి కారుపై దాడి

4



గత సంవత్సరం దుందుభీ నది ఉధృతికి దెబ్బతిన్న కాజ్‌వేను పరిశీలించి బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తానని హామీ ఇస్తున్న ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి

తీరనున్న కష్టాలు

» సిర్సవాడ బ్రిడ్జికి రూ.20.20 కోట్లు మంజూరు

» ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం

4



విలేకరులతో మాట్లాడుతున్న డీఎస్పీ వెంకటేశ్వర రావు, చిత్రంలో సీఐ కృష్ణయ్య తదితరులు

వివాహేతర సంబంధానికి అడ్డు తొలగించుకునేందుకు హత్య

» రహమతుల్లా హత్య కేసులో ముగ్గురి అరెస్టు

» డీఎస్పీ వెంకటేశ్వరరావు

4

ఆత్మవిశ్వాసమే అండగా..

» ఆదర్శంగా జీవిస్తున్న సంతోషమ్మ

» రెండు కాళ్లు లేకున్నా స్వయం ఉపాధితో జీవనం

» తల్లిదండ్రులు మరణించినా రాణిస్తున్న వైనం

పోలియో తన శరీరానికే కానీ, తన ఆలోచనకు, ఆత్మవిశ్వాసానికి కాదని నిరూపిస్తున్నది సంతోషమ్మ. అవసరాలు, కష్టానికి ఆకలి తోడవడంతో స్వయం ఉపాధితో వాటిని అధిగమించింది. ఏంచేయగలను అనే నిస్సహాయతను దరి చేరనీయకుండా శ్రమను నమ్ముకుంది. చిన్నపాటి వ్యాపారమే ఆలంబనతో ముందుకు సాగుతూ ఆదర్శంగా జీవిస్తున్నది.



అయిజటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అందరి ఆడపిల్లల్లాగా తండ్రి ప్రేమకు నోచుకోలేదు ఆ అమ్మాయి. తల్లి ప్రేమ అయినా పూర్తిగా అందిందా అంటే అది కూడా తక్కువే అని చెప్పాలి. అయిజ మండలం, మేడికొండ గ్రామానికి చెందిన మాదిగ నాగమ్మ, నాగన్న దంపతులకు 12 మంది సంతానం. అందులో 9మంది ఆడపిల్లలు కాగా 3 మగపిల్లలు. వీరిలో 9వ సంతానంగా జన్మించింది సంతోషమ్మ. అమ్మకడుపులో నుంచి బయటి ప్రపంచంలోకి అడుగు పెట్టే సమయానే ఈ అమ్మాయి పోలియో కారణంగా రెండు కాళ్లు చచ్చుబడి నడవటానికి వీలులేని విధంగా జన్మించింది. రెక్కాడితే కానీ డొక్కాడని ఆ కుటుంబానికి రోజువారి తిండి దొరకటమే కష్టంగా బతికారు. సంతోషమ్మకు మూడేళ్ల వయసు ఉన్నప్పుడే 1989లో తండ్రి మరణించారు. ఆ తరువాత అనేక కష్టాలు పడి కుటుంబాన్ని పోషించిన తల్లికూడా 2013లో మరణించింది. 2001లో 10వ తరగతి వరకు ప్రభుత్వ పాఠశాలలో చదివిన సంతోషమ్మను పైచదువులు చదివించే వారు లేకపోవటంతో ఇంటివద్దే ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది. దీంతో జీవనం చాలాకష్టమైంది. అన్నదమ్ములు ఎవరికి వారే వేరుకాగా, ఆడపిల్లలంతా వివాహాలు చేసుకుని ఇంటినుంచి వెళ్లిపోయారు. తనను పోషించే వారు లేకపోవటంతో రోజువారి తిండికి నానా కష్టాలు పడాల్సి వచ్చింది. ఇలాగే ఉంటే ఇంకా ఇబ్బందులు ఎదురవుతాయి తప్పా కష్టాలు తీరే మార్గం మాత్రం దొరకదని గ్రహించి 2002లో వికలాంగుల కోటలో తనకు వచ్చే పింఛన్ డబ్బులతో పాటు, తెలిసిన వారివద్ద నుంచి మరికొంత డబ్బు అప్పుగా తీసుకుని రూ.3000లతో చిన్నపిల్లలకు ఉపయోగపడే తినుబండారాలు తెచ్చుకుని ఇంటి అరుగు మీద కూర్చుని విక్రయించటం మొదలుపెట్టింది. వాటిని అమ్మగా వచ్చే ఆదాయంతో తాను జీవనం కొనసాగించేది. 2005 సంవత్సరంలో రూ.20వేలు ఖర్చుపెట్టి చిన్నపాటి డబ్బాను కొనుక్కుని తాను నివసిస్తున్న ప్రాంతానికి సమీపంలో చిన్నకిరాణం ఏర్పాటు చేసుకుంది. అప్పటి నుంచి ఇప్పటివరకు కూడా ప్రతినెలా తనకు ప్రభుత్వం నుంచి వచ్చే రూ.4000ల పింఛన్ డబ్బులతో సరుకులు కొనుగోలు చేస్తూ, అమ్ముతూ నలుగురికి ఆదర్శంగా జీవిస్తున్నది. రెండు కాళ్లు లేకపోయినా ప్రభుత్వం మంజూరు చేసిన చార్జింగ్ ట్రై సైకిల్‌పై 8 కిలోమీటర్ల దూరంలో ఉండే అయిజకు వెళ్లి సరుకులు కొనుగోలు చేసి, ఆటోలో తెచ్చి వ్యాపారం చేస్తూ పొట్టపోసుకుంటుంది.



ప్రభుత్వ అందజేసిన చార్జింగ్ ట్రై సైకిల్‌తో వికలాంగురాలు సంతోషమ్మ



మేడికొండలో చిన్నపాటి దుకాణాన్ని నిర్వహిస్తున్న సంతోషమ్మ

పది పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

» అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఈనెల 21వ తేదీ నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వనపర్తి జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో చీఫ్ సూపరింటెండెంట్‌లు, డిపార్ట్‌మెంట్ అధికారులకు పదో తరగతి పరీక్షల నిర్వహణపై సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి అదనపు కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారి అబ్దుల్ ఘనితో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. మార్చి 21 నుంచి ఏప్రిల్ 2 వరకు జరగనున్న పదో తరగతి పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా పకడ్బందీగా నిర్వహించాలని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 36 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటిలో మొత్తం 6853 మంది విద్యార్థులు పరీక్షలు రాయబోతున్నట్లు తెలిపారు. ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఏసీజీ గణేష్, చీఫ్ సూపరింటెండెంట్లు ,డిపార్ట్‌మెంటల్ అధికారులు, ఇతర విద్యాశాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు

సింగరేణి ప్రణాళిక సిద్ధం

● ఎస్‌ఎల్‌బీసీ సొరంగంలో పనులు సాగేందుకు, ప్రమాద నివారణకు...

» నేడో రేపో దోమలపెంటకు చేరనున్న సామగ్రి

» సింగరేణి కాలరీస్ జీఎం డీఎల్ బైద్యా నేతృత్వంలో మరిన్ని బృందాలు

దోమలపెంట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): శ్రీశైలం ఎడమ గట్టు సొరంగంలో జరిగిన ప్రమాద ఘటన 8 మంది చిక్కుకున్న వారిని వెలికి తీసేందుకు అనేక రకాల ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ కొంత భయంతో ఉన్నారనేది వాస్తవం. పనులు కూడా మందకొడిగా సాగుతున్నాయి. ఇక ముందు మరో ప్రమాదం జరుగకుండా ముందస్తు చర్యలు తీసుకునేందుకు ప్రభుత్వం సింగరేణి గనులలో వాడే విధానాన్ని ఉపయోగించుకోవాలని ప్రణాళికను సిద్ధం చేశా రు. సింగరేణి కాలరీస్ జీఎం డీఎల్ బైద్యా నేతృత్వంలో మరిన్ని బృందాలు ఎస్‌ఎల్‌బీసీకి రానున్నాయి.

● రాబోయే ప్రమాదాన్ని ముందస్తుగా గుర్తింపునకు..

సింగరేణి బొగ్గు గనుల్లో వాడే విధానాన్ని ఉపయోగించి ఎస్ఎల్‌బీసీ సొరంగంలో కూలిన శిథిలాలను తొలగించేందుకు ఉపయోగించనున్నారు. సొరంగం లోపల అడుగు భాగంలో వెడ్జెస్ కర్రలతో బేస్‌ను ఏర్పాటు చేసి ఆపైన ఎటూ నాలుగు ఇన్చ్‌ల మందంలో నాలుగున్నర అడుగుల పొడవున ఉండే ఈ కర్రలను అంచెలంచెలుగా ఎత్తుకు పెంచుకుంటారు. ఇందుకు ప్రత్యేక మైన కర్రలను ఎంచుకుంటారు. ఆపై భాగంలో ఇనుములో కూడి న ఒక మీటర్ పొడవు ఉండే టైగర్ క్లాక్సనూ (ప్లేట్స్) అమర్చుతారు. వీటికి అనుబంధంగా అడుగున్నర బోల్ట్‌ను కొండకు డ్రిల్ చేసి బిగిస్తారు. పనులు చేపట్టే ప్రాంతంలో లోడ్ సెల్, టిల్‌టిల్ అనే పరికరాలు అమర్చుతారు. కొండలు కూలే ముందు ఒత్తిడికి గురై 3 నుంచి 5 నిమిషాల్లో ప్రమాదం సంభవిస్తుందనే సంకేతంతో ఒక రకమైన శబ్ధంతో పాటు, టిల్‌టిల్ పరికరం రెడ్ సిగ్నల్‌ను ఇస్తుంది. తద్వారా ప్రమాదం జరిగే ప్రాంతం నుంచి తప్పించుకునేందుకు ఈ విధానం ఎంతగానో ఉపయోగపడుతుందని సింగరేణి బొగ్గు గనుల్లో పనిచేసే అనుభవం ఉన్న కార్మికులు పేర్కొంటున్నారు. ఇక సొరంగంలో శిథిలాల కింద ఉన్నటువంటి టీబీఎం మిషన్ విడిభాగాలను తొలగించేందుకు ప్రత్యేకంగా గ్యాస్ కట్టర్‌లు, వెల్డింగ్ కట్టర్లను కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం. మరో రెండు రోజుల్లో తవ్వకాల పనులు వేగవంతం కానున్నాయి.



సింగరేణి బృందంతో సింగరేణి కాలరీస్ జీఎం డీఎల్ బైద్యా

ప్రమాదకరమైన పరిస్థితిలో పనులు

● సొరంగంలో టీబీఎం మిషన్ వరకు ఎక్సకవేటర్ వెళ్లేందుకు మరో 24 గంటల సమయం పట్టే అవకాశం ఉన్నది. ప్రస్తుతం శిథిలాల కింద నుంచి వచ్చే నీటిని 24 గంటలు పరిశీలిస్తున్నాం. ప్రస్తుతం వచ్చే నీరు తేటగా ఉన్నందున ప్రస్తుతం కిందలు కూలడం లేదు అనేది ఒక సంకేతం. నీరు బురదగా మారిందంటే మరో ప్రమాదానికి సంకేతం ఇక్కడ చాలా సున్నితంగా, జాగ్రత్తగా పనులు ముందుకు సాగాలి.

- డీఎల్ బైద్యా,
సింగరేణి కాలరీస్ జీఎం

మహిళా సంక్షేమానికి పెద్దపీట

● మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

● రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు



మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

కేక్ కట్ చేస్తున్న బండ్ల జ్యోతి

గద్వాల న్యూటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మహిళల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేసిందని, మహిళల అభ్యున్నతికి పాటుపడతానని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మంత్రి జూపల్లి కృష్ణారావు హాజరై మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ఎన్నో సంఘటనలు జరుగుతున్నాయి కాబట్టి మహిళలు వాటిని ఎదుర్కొనే విధంగా ఉండాలన్నారు. ప్రతీ మహిళ ధైర్యవంతురాలుగా ఉండాలన్నారు. మహిళల అభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు.

ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి మాట్లాడుతూ.. నేడు తెలంగాణలో ముఖ్యమంత్రి నాయకత్వంలో మహిళలకు పెద్దపీట వేసి మహిళల అభివృద్ధికి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. నియోజకవర్గ మహిళలకు అన్నివేళలా అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్యే సతీమణి బండ్ల జ్యోతి మాట్లాడుతూ.. గద్వాల ఎమ్మెల్యే మహిళలపై ప్రత్యేక దృష్టి సారించి అన్ని రంగాల్లో రాణించేలా కృషి చేస్తున్నారన్నారు. పాఠశాల విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ, స్టడీ మెటీరియల్స్ డీఎస్సీ పోటీ పరీక్షలకు దూర ప్రాంతాలకు వెళ్లి ఇబ్బందులు పడకుండా గద్వాలలోనే ప్రత్యేకంగా సొంత ఖర్చుతో ఉచితంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేశారన్నారు. అలాగే మహిళలకు కుట్టు మిషన్ల శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ప్రతీ మహిళ స్వశక్తితో ముందుకెళ్తూ ఉన్నతంగా రాణించాలన్నారు. అంతకు ముందు మహిళా దినోత్సవం సందర్భంగా మహిళలు, చిన్నారులతో కలిసి ఆమె కేక్ కట్ చేశారు. అనంతరం వివిధ పాఠశాలల చిన్నారులచే నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని అలరించాయి. ప్రజాప్రతినిధులు, వివిధ రంగాల ఉద్యోగులు, మాజీ ప్రజాప్రతినిధులు, జిల్లా స్థాయి నాయకులు ఉన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

- కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి



వేరుశనగ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి

కల్వకుర్తి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని కల్వకుర్తి ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. రైతులు పండించిన పంటలకు గిట్టుబాటు ధర కల్పించనున్నట్లు పేర్కొన్నారు. కల్వకుర్తి పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ ఆవరణలో నేషనల్ కో ఆపరేటివ్ కంజ్యూమర్ ఫెడరేషన్ (ఎన్‌సీసీఎఫ్) సౌజన్యంతో పీఏసీఎస్, మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వేరుశనగ, శనగ కొనుగోలు కేంద్రాన్ని ఎమ్మెల్యే కశిరెడ్డి నారాయ ణరెడ్డి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్‌సీసీఎఫ్ ద్వారా వేరుశనగకు క్వింటాల్‌కు మద్దతు ధర రూ.6783 నిర్ణయించినట్లు తెలిపారు. రైతులు నేరుగా తమ వేరుశనగను తీసుకొచ్చి విక్రయించుకుని మద్దతు ధర పొందవచ్చన్నారు. కల్వకుర్తికి ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. ఆసుపత్రి నిర్మాణం, వసతుల కల్పనకు రూ.45కోట్ల 50లక్షలు, 127మంది సిబ్బందిని కేటాయిస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. పొల్యూషన్ కంట్రోల్ బోర్డు సభ్యులు ఠాకూర్ బాలాజీసింగ్, పీఏసీఎస్ చైర్మన్ తలసాని జనార్దన్‌రెడ్డి, మార్కెట్ చైర్మన్ మనీలా సంజీవ్‌కుమార్‌యాదవ్, వైస్ చైర్మన్ పండిట్‌రావు, ఎన్‌సీసీఎఫ్ రాష్ట్ర అడ్వయిజర్ జగదీశ్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు బృంగి ఆనంద్‌కుమార్, పసుల సుదర్శన్‌రెడ్డి, ఎన్నం భూపతిరెడ్డి, కల్వకుర్తి మార్కెట్ డైరెక్టర్ పసుల రమాకాంత్‌రెడ్డి, కాంగ్రెస్ నాయకులు విజయ్‌కుమార్ రెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, చంద్రకాంత్‌రెడ్డి, గోరటి శ్రీనివాసులు తదితరులు ఉన్నారు.

బైకు ఢీ: వ్యక్తి మృతి

- ఊర్కొండలో కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై ఘటన

ఊర్కొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : బైకు ఢీకొన్న ఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలై మృతిచెందాడు. ఈ సంఘటన నాగర్‌కర్నూల్ జిల్లా ఊర్కొండలోని కల్వకుర్తి-జడ్చర్ల ప్రధాన రహదారిపై సబ్‌స్టేషన్ సమీపంలో శుక్రవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామానికి చెందిన చిన్న వెంకటయ్య గ్రామ పంచాయతీ కార్మికుడిగా విధులు నిర్వహిస్తూ ఇటీవలే తొలగించబడ్డాడు. మండల కేంద్రంలో సొంత పనులు ముగించుకొని కల్వకుర్తి-జడ్చర్ల రోడ్డు మార్గాన కాలినడకన స్వగ్రామం వెళుతున్న క్రమంలో బైకు బలంగా ఢీ కొట్టింది. దాంతో అతనికి బలమైన గాయాలు కావడంతో స్థానికులు 108 వాహనంలో కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అక్కడ ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యంలో మృతి చెందాడని కుటుంబ సభ్యులు తెలిపారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

నాగర్‌కర్నూల్ క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కుటుంబ కలహాలతో కల్మారి రాముడు(38) చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నాగర్‌కర్నూల్ మండలంలోని అవురాసిపల్లి గ్రామంలో శుక్రవారం చోటు చేసుకున్నట్లు ఏఎస్‌ఐ చంద్రయ్య తెలిపారు. అవురాసిపల్లి గ్రామానికి చెందిన రాముడు గత కొంతకాలంగా మద్యానికి బానిస అయ్యాడు. దీంతో భార్యతో తరచూ గొడవపడేవాడు. రోజు మాదిరిగానే శుక్రవారం భార్యతో గొడవ పడి ఇంటి నుంచి బయటకు వెళ్లి గ్రామ చివరన పొలంలో చెట్టుకు ఉరి పెట్టుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. చుట్టుపక్కల వారు గమనించేసరికి అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ సంఘనటపై మృతుని భార్య యశోద ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్‌ఐ చంద్రయ్య తెలిపారు. మృతునికి 6 సంవత్సరాల రోహిత్, ఐదు సంవత్సరాల జయశంకర్‌లు ఉన్నారు.



దీక్షల్లో కూర్చున్న నిర్వాసితులు

కొనసాగుతున్న ఉదండాపూర్
నిర్వాసితుల రిలేదీక్ష

జడ్చర్ల, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పెంచిన పరిహారంతోపాటు వన్‌టైం సెటిల్‌మెంట్‌తో పరిహారం ఇవ్వాలని ఉదండాపూర్ నిర్వాసితులు శుక్రవారం రిలేదీక్షలు కొనసాగించారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణంలో సర్వం కోల్పోతున్నామని, నిర్వాసితులకు న్యాయమైన పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ నిర్వాసితులు చేపట్టిన దీక్షలు 28వ రోజుకు చేరాయి. న్యాయమైన డిమాండ్‌లను రాష్ట్ర ప్రభుత్వం పరిష్కరించాలని కోరారు. రిలే దీక్షలలో నిర్వాసితులు రామకృష్ణ, శివరాజ్, జ్ఞానేశ్వర్, నందీశ్వర్, శ్రీకాంత్, శివకుమార్, శ్రీనివాస్, శివశంకర్, చెన్నయ్య, చాకలిరాజు, శివకుమార్ పాల్గొన్నారు.



జిల్లా కేంద్రంలోని జామా మసీదులో ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు

మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు

మహబూబ్‌నగర్ అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : రంజాన్ మాసంలో మొదటి శుక్రవారం నమాజ్ భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మసీదుల్లో మధ్యాహ్నం 1:30 గంటలకు నమాజ్ ఆచరించారు. పవిత్ర రంజాన్ మాసంలో శుక్రవారం నమాజ్‌కు ఎంతో ప్రాధాన్యం ఉంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని తూర్పుకమాన్ వద్ద ఉన్న జామా మసీదులో హఫీజ్ సయ్యద్ ముజహిద్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

బీసీ సంక్షేమ జిల్లా అధికారి
బీరం సుబ్బారెడ్డి సస్పెన్షన్

● వనపర్తి కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : విధులపై నిర్లక్ష్యంగా వ్యవహరించడం కారణంగా జిల్లా బీసీ సంక్షేమ అధికారి బీరం సుబ్బారెడ్డిని సస్పెండ్ చేసినట్లు కలెక్టర్ ఆదర్శ్ సురభి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ నిధుల దుర్వినియోగం, ఇతర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రాథమిక విచారణ జరిపి, ఆరోపణలు వాస్తవమని తేలడంతో శుక్రవారం బీరం సుబ్బారెడ్డిపై కలెక్టర్ సస్పెన్షన్ వేటు వేశారు. ప్రస్తుతం బీరం సుబ్బారెడ్డి నిర్వహిస్తున్న బీసీ సంక్షేమ శాఖ అధికారి, గిరిజన సంక్షేమ శాఖల పూర్తి అదనపు బాధ్యతలను డీఆర్‌డీవో ఉమాదేవికి అప్పగిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు.

18న
పాలమూరు వర్సిటీలో యువ ఉత్సవ్

పాలమూరు యూనివర్సిటీ, మార్చి 7: పాలమూరు యూనివర్సిటీలోని లైబ్రరీ ఆడిటోరియంలో ఈనెల 18న యువ ఉత్సవ్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఎన్‌వైకే జిల్లా కోఆర్డినేటర్ కోటా నాయక్ తెలిపారు. శుక్రవారం పీయూ వీసీ చాంబర్‌లో వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, ఎన్‌వైకే జిల్లా కో ఆర్డినేటర్ కోటా నాయక్, అధికారులతో కలిసి వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నామని, ప్రతిభను గుర్తించి పారితోషికాన్ని అందించనున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో రాజేందర్, అధికారులు పాల్గొన్నారు.



యువ ఉత్సవ్ పోస్టర్లను విడుదల చేస్తున్న పీయూ వీసీ ప్రొఫెసర్ జీఎన్ శ్రీనివాస్, ఎన్‌వైకే జిల్లా కో ఆర్డినేటర్ కోటా నాయక్, అధికారులు

'ఆకర్షణ' సేవలు అభినందనీయం

● విద్యార్థులు స్మార్ట్‌ఫోన్‌ను వీడి పుస్తకాలు చదవాలి: ఎస్పీ జానకి



విద్యార్థిని ఆకర్షణను సత్కరిస్తున్న ఎస్పీ జానకి

కోయిలకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు స్మార్ట్‌ఫోన్ మాని పుస్తక పఠనం చేయాలని మహబూబ్‌నగర్ ఎస్పీ జానకి సూచించారు. శుక్రవారం మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలంలోని ఇబ్రహీంనగర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థి ఆకర్షణచే ఏర్పాటు చేసిన గ్రంథాలయాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు ఫోన్‌లో గేమ్స్ ఆడి, రీల్స్ చూసి పుస్తక పఠనం మరిచిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తల్లిదండ్రులు పిల్లలకు ఫోన్‌లు ఇవ్వకుండా పుస్తకాలు కొనివ్వాలని సూచించారు విద్యార్థి ఆకర్షణ తన తోటి విద్యార్థుల కోసం 19 గ్రంథాలయాలు ఏర్పాటు చేసి 20వ గ్రంథాలయం పాలమూరు జిల్లాలోని మారుమూల ప్రాంతంలో ఏర్పాటు చేయడం అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థిని శాలువాతో సత్కరించి జ్ఞాపిక అందించారు. హైదరాబాద్ పబ్లిక్ స్కూల్‌లో 8వ తరగతి చదువుతున్న ఆకర్షణ అబ్దుల్‌కలాం స్ఫూర్తితో తల్లిదండ్రులు, స్నేహితులతో పుస్తకాలు సేకరిస్తూ హైదరాబాదు, సిద్దిపేటలోని ప్రభుత్వ పాఠశాలల్లో 19 గ్రంథాలయాలు ఏర్పాటు చేసింది. ఇబ్రహీంనగర్‌లో ఏర్పాటు చేసిన గ్రంథాలయంలో 520 విలువైన పుస్తకాలు అందించారు. గ్రంథాలయాలు ఏర్పాటు చేస్తున్న ఆకర్షణను మన్‌కీ బాత్‌లో ప్రధాని మోదీ అభినందించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. కార్యక్రమంలో ఏఎంవో శ్రీనివాస్, సీఎంవో బాలుయాదవ్, ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీవో హరీశ్‌రెడ్డి, ఎంఈవో వెంకట్‌జీ పాల్గొన్నారు.

జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్తగా గ్రీష్మారెడ్డి



డాక్టర్ కొత్తూర్ గ్రీష్మారెడ్డి

కోయిలకొండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ పరిశోధన మండలి ఐకార్ జాతీయ వ్యవసాయ శాస్త్రవేత్తగా మహబూబ్‌నగర్ జిల్లా కోయిలకొండ మండలం వింజమూరు వాసి కొత్తూరు గ్రీష్మారెడ్డి ఎంపికయ్యారు. రైతులకు మేలు చేయాలన్న లక్ష్యంతో జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో బీఎస్సీ అగ్రికల్చర్ పూర్తి చేసి మహారాష్ట్ర లో ఎమ్మెస్సీ చేసిన అనంతరం ఐకార్ నిర్వహించిన జాతీయ స్థాయి సీనియర్ రీసెర్చ్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారు. ప్లాంట్ పాథాలజీ మొక్కల వ్యాధి అధ్యయన శాస్త్రం పీహెచ్‌డీ పూర్తి చేసి డాక్టరేట్ సాధించారు. వ్యవసాయ సాగులో పంటల చీడ పీడల నివారణ కోసం శాస్త్రీయమైన పరిశోధనలు చేసి అన్నదాతలను ఆదుకోవడమే లక్ష్యమని శాస్త్రవేత్త గ్రీష్మారెడ్డి తెలిపారు.

వ్యవసాయ మార్కెట్ బిల్లును
రద్దు చేయాలి

● సంయుక్త కిసాన్‌మోర్చా నాయకుల డిమాండ్



తహసీల్దార్ అమరేందర్‌కృష్ణకు వినతిపత్రం అందజేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

నారాయణపేటటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక, కార్పొరేట్ శక్తుల అనుకూల విధానాన్ని నిరసిస్తూ శుక్రవారం పట్టణంలోని మునిసిపల్ పార్కు వద్ద కార్మికులు, కిసాన్‌మోర్చా నాయకులు ధర్నా నిర్వహించారు. మార్చి 5 నుంచి 13 వరకు జిల్లా కేంద్రాల్లో ధర్నా నిర్వహించాలనే పిలుపులో భాగంగా ధర్నా నిర్వహించినట్లు అఖిల భారత ఐక్య రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు చెన్నారెడ్డి, తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజయ్యగౌడ్‌లు తెలిపారు. ధర్నా అనంతరం తహసీల్దార్ అమరేందర్‌కృష్ణకు వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కరోనా సమయంలో కేంద్ర ప్రభుత్వం మూడు వ్యవసాయ నల్ల చట్టాలను కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా తీసుకువచ్చిందని, 13 నెలల ఉద్యమం అనంతరం ఆ చట్టాలను రద్దు చేసిందని గుర్తు చేశారు. కార్యక్రమంలో కృష్ణయ్య, కొండ నర్సింలు, నారాయణ, బాలకృష్ణ, ప్రశాంత్, వెంకట్‌రాములు తదితరులున్నారు.

తీరనున్న కష్టాలు

» సిర్సవాడ బ్రిడ్జికి రూ.20.20 కోట్లు మంజూరు

» జీవో జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం



:సిర్సవాడ, మాదారం గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారిపై దుందుభీ నదిలో ప్రమాదకరంగా దెబ్బతిన్న లోలెవల్ కాజ్‌వే ప్రదేశంలోనే నూతన బ్రిడ్జి నిర్మాణం

నాగర్‌కర్నూల్/తాడూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : దుందుభీ నది తీర ప్రాంతాల ప్రజల దుఃఖం తీరబోతున్నది. హైలెవల్ వంతెన లేక అష్టకష్టాలు పడుతున్న ప్రజల అవసరాలను గుర్తిస్తూ రాష్ట్ర ప్రభుత్వం 20కోట్ల 20లక్షల రూపాయలు కేటాయించడంతో రవాణా సదుపాయం మెరుగు పడనుంది. రవాణా సౌకర్యానికి ఆటంకాలు తొలగిపోనున్నాయి. దీంతో జనం కష్టాలు తీరిపోతున్నాయి. ప్రతీ సంవత్సరం వర్షాకాలం వచ్చినప్పుడల్లా నది ప్రవహిస్తున్న క్రమంలో సిర్సవాడ నుంచి జడ్చర్ల, కల్వకుర్తి ప్రాంతాలకు వెళ్లాలంటే అష్టకష్టాలు పడాల్సి వస్తుంది. దుందుభీని దాటే క్రమంలో అనేక ప్రమాదాలు కూడా చోటు చేసుకుంటున్నాయి. ఈ క్రమంలో ప్రజల అవసరాలను గుర్తించాలని చేసిన విన్నపం మేరకు ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి ఈ సమస్యను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. సిర్సవాడలో హైలెవల్ నిర్మాణం ఆవశ్యకతను గుర్తించిన ప్రభుత్వం వెంటనే ఆమోదం తెలిపింది. దీని నిర్మాణానికి 20కోట్ల 20లక్షలు కేటాయిస్తూ శుక్రవారం ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఎమ్మెల్యే చిత్ర పటానికి క్షీరాభిషేకం

తాడూరు మండలంలోని సిర్సవాడ గ్రామం వద్ద ఉన్న కాజ్‌వే ఇటీవల శిథిలావస్థకు గురై రాకపోకలకు నిలిచిపోయాయి. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని ఎమ్మెల్యే కూచకుళ్ల రాజేష్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే గత సంవత్సర కాలంగా ప్రయత్నించి శుక్రవారం నూతన బ్రిడ్జి మంజూరు చేయించారు. దీంతో 20కోట్ల 20 లక్షల రూపాయలతో నూతన హైలెవల్ వంతెన నిర్మించేందుకు అవసరమైన నిధులను ప్రభుత్వం నుంచి సమకూర్చారు. దీంతో సిర్సవాడ, పాపగల్, తదితర గ్రామాల కాంగ్రెస్ పార్టీ శ్రేణులు, రైతులు గ్రామస్థుల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే రాజేష్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేసి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా యూత్ అధ్యక్షుడు వినోద్, మండల అధ్యక్షుడు మల్లేష్, సిర్సవాడ గ్రామ మాజీ సర్పంచ్ రాజేందర్‌రెడ్డి, పాపగల్ గ్రామ మాజీ సర్పంచ్ రమేష్, నారాయణ, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు లింగం, అల్లోజీ, మల్లేష్, రాఘవేందర్, శివ, రాములు తోపాటు ఆయా గ్రామాలకు చెందిన కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు, రైతులు, ప్రజలు పాల్గొన్నారు.

● కష్టాలు తీరుతాయి



దుందుభీ నదికి వరద వచ్చినప్పుడల్లా జనం పడే కష్టాలు కళ్లారా చూశాను. ఎన్నికల ప్రచార సమయంలో ఇక్కడ హైలెవల్ వంతెన నిర్మాణం చేయిస్తానని హామీ ఇచ్చాను. ఆ దిశగా నేను చేసిన ప్రయత్నాలు సఫలీకృతమయ్యాయి. 20కోట్ల 20లక్షల రూపాయలు కేటాయించిన ముఖ్యమంత్రికి, ఉప ముఖ్యమంత్రికి, పంచాయతీరాజ్ మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నా. సాధ్యమైనంత త్వరలో ఈ పనులు పూర్తి చేయిస్తాను.

- కూచకుళ్ల రాజేష్‌రెడ్డి, ఎమ్మెల్యే, నాగర్‌కర్నూల్

ఏకలవ్య పాఠశాలలో వసతులపై ఆరా

» తనిఖీ చేసిన గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ జేడీ



పాఠశాల ఆవరణలో మౌలిక వసతులు పరిశీలిస్తున్న జేడీ శివానంద

వెల్దండ, మార్చి7(ఆంధ్రజ్యోతి) : విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని కేంద్ర గిరిజన వ్యవహారాల మంత్రిత్వశాఖ జాయింట్ డైరెక్టర్ శివానంద బచిగుండి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గుండాల ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాలను ఏకలవ్య గురుకులాల అకాడమిక్ ఓఎస్డీ రామారావుతో కలిసి శివానంద బచిగుండి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలోని మౌళిక వసతుల గురించి అడిగితెలుసుకున్నారు. విద్యార్థులకు విద్యతో పాటు క్రీడల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలని సూచించారు. నాణ్యమైన భోజనం అందించాలని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటుచేస్తున్న క్రీడాప్రాంగణాన్ని పరిశీలించారు. విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని శివానంద బచిగుండి సూచించారు. కార్యక్రమంలో స్పోర్ట్స్ అధికారి వీర్యా నాయక్, ప్రిన్సిపాల్ పార్థివ్‌కుమార్, ఉపాధ్యాయులు బాస్కర్, సుమన్, రీనా ఉన్నారు.

కొనసాగుతున్న శ్రీరంగనాయకస్వామి ఉత్సవాలు



ధ్వజరోహణం పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

పెబ్బేరు రూరల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : శ్రీరంగాపురంలో ప్రసిద్ధిగాంచిన శ్రీరంగనాయకస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం ధ్వజారోహణం పూజ కార్యక్రమాలు కొనసాగాయి. మృత్సంగ్రహణం, అంకురార్పణ, దేవతాహ్వానం, భేరీ పూజలు అర్చకులు నిర్వహించారు. 9 రోజులుగా నిర్వహించే ఉత్సవాలు ఆలయ సంప్రదాయంగా కొనసాగుతున్నట్లు ప్రధాన ముఖ్య అర్చకుడు విష్ణునారాయణ తెలిపారు. ఈ నెల 15వ తేదీ వరకు ఈ ఉత్సవాల్లు కొనసాగుతాయి. శనివారం రోజున శ్రీవారి మూలమంత్ర హవనంపై స్వామివారిని ఊరేగింపు నిర్వహిస్తున్నట్లు అర్చకులు తెలిపారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్ని ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆలయ పర్యవేక్షకుడు మహేష్ తెలిపారు. కార్యక్రమంలో అర్చకులు సురేషా చార్యులు, కన్నయ్య స్వామి, గోవిందాచార్యులు, కిట్టుస్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

దొంగల హల్‌చల్

» రోడ్డుకు అడ్డంగా రాళ్లు పెట్టి కారుపై దాడి



దొంగల చేతుల్లో ధ్వంసమైన కారు అద్దాలు

కొల్లాపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కొల్లాపూర్ మండల పరిధిలోని అంకిరావుపల్లి గ్రామం గెట్ సమీపంలోని ఎంజీకేఎల్‌ఐ కాలువ దగ్గర గురువారం రాత్రి దారి దోపిడీ దొంగలు హల్‌చల్ చేశారు. గురువారం రాత్రి కొల్లాపూర్ వైపు వస్తున్న కారుపై అటాక్ చేసి రాళ్లతో అద్దాలు పగలగొట్టారు. రోడ్డుపై రాళ్లు పెట్టి అటాక్ చేయబోయారని బాధితుడు రమేష్ వాపోయారు. కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని పెంట్లవెల్లి మండల కేంద్రానికి చెందిన గోల్డ్ వ్యాపారస్తుడు రమేష్ హైదరాబాద్ వెళ్లి వ్యాపారం చూసుకొని తిరిగి సొంత గ్రామానికి చేరుతుండగా ఘటన చోటు చేసుకుంది. కొల్లాపూర్ సమీపంలో ఉన్న అంకిరావుపల్లి గ్రామం చేరువలో రోడ్డుపై రాళ్లను చూసిన కారులోని వ్యక్తులు సైడుకు తీసుకోవడంతో కొంతమంది అటాక్ చేయడానికి వచ్చారన్నారు. తాము వెంటనే అప్రమత్తమైన కారు డ్రైవర్ కారును స్పీడుగా పోవడంతో తప్పించుకుని కొల్లాపూర్ పోలీస్ స్టేషన్‌కు వెళ్లి పోలీసులకు సమాచారం ఇచ్చినట్లు తెలిపారు. రంగంలోకి దిగిన కొల్లాపూర్ సీఐ మహేష్ ఎస్‌ఐ రిషికేష్ శుక్రవారం ఉదయం డాగ్ స్క్వాడ్‌తో ఘటన స్థలాన్ని పరిశీలించారు. కారు దబాయించినప్పుడు అడ్డగించిన వ్యక్తికి దెబ్బలు తగలడంతో రక్తపు మరకలు రోడ్డుపై పడ్డాయి. వాటిని పోలీసులు పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నట్లు సీఐ మహేష్ తెలిపారు.

వివాహేతర సంబంధానికి
అడ్డు తొలగించుకునేందుకు హత్య

» రహమతుల్లా హత్య కేసులో ముగ్గురి అరెస్టు

» డీఎస్పీ వెంకటేశ్వరరావు

వనపర్తి క్రైమ్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వివాహేతల సంబంధానికి అడ్డొస్తున్నాడనే నేపథ్యంతో ఓ వ్యక్తిని దారుణ హత్య చేసిన కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పాన్‌గల్ మండల కేంద్రానికి చెందిన ఎండీ పర్వీన్ బేగంకు 12 సంవత్సరాల క్రితం కర్నూల్ పట్టణానికి చెందిన ఎండీ రహమతుల్లాతో వివాహమైంది. ఆ తరువాత వారు కర్నూల్‌లో రెండు సంవత్సరాలు నివాసం ఉన్నారు. ఆ తరువాత భార్యాభర్తల మధ్యల మనస్పర్థలు రావడంతో పర్వీన్ బేగం తల్లిగారి ఊరైన పాన్‌గల్ మండల కేంద్రంలోనే నివాసం ఉంటుంది. రహమతుల్లా వృత్తిరీత్యా పెయింటింగ్ పనితో పాటు కూలీ పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. పర్వీన్ బేగం తన ఇంటికి కొద్ది దూరంలో టైలరింగ్ పని నేర్చుకునేందుకు వెళ్తుండగా.. ఆ పక్కనే కిరాణం దుకాణం నడుపుతున్న కుమ్మరి రాఘవేంద్రతో పరిచయమై వారిద్దరి మధ్య వివాహేతర సంబంధం ఏర్పడింది. పర్వీన్ బేగం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో రాఘవేంద్రను ఇంటికి పిలిచి శారీరకంగా కలిసేవాడు. ఈ క్రమంలోనే ఒకసారి వీరిద్దరూ ఇంట్లో ఉండగా పర్వీన్ బేగం భర్త రహమతుల్లా వారిద్దరిని చూసి పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టి మందలించారు. ఈ విషయం తెలిసినప్పటి నుంచి రహమతుల్లా పర్వీన్ బేగం ను చిత్రహింసలకు గురి చేయడంతో పాటు రాఘవేంద్ర తో గొడవ పెట్టుకునే వాడు. పర్వీన్ బేగం తనను ఎక్కడైనా తీసుకెళ్లాలని ఇంట్లో తన భర్త చాలా ఇబ్బందులకు గురి చేస్తున్నాడని రాఘవేంద్ర దృష్టికి తీసుకువెళ్లింది. ఈ క్రమంలోనే రాఘవేంద్ర తనకు పరిచయం ఉన్న కురుమూర్తితో రహమతుల్లాను చంపాలని తెలియజేశాడు. వారు అనుకున్న పథకం ప్రకారం మార్చి 1న తెల్లవారు జామున కురుమూర్తి.. రహమతుల్లా ఇంటికి వెళ్లి.. గొర్రె పొట్టేలు కోసేందుకు రావాలని కోరాడు. అతను వెంట రాగా.. గ్రామ శివారులోని ప్రభుత్వ జూనియర్ కాలేజ్ వద్ద మాటు వేసిన రాఘవేంద్ర తన స్నేహితుడైన కురుమూర్తితో కలిసి రహమతుల్లా పై కత్తితో దాడి చేసి చంపేశాడు.

అనంతర కేఎల్‌ఐ కాలువలో పడేశారు. బాధిత కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్న ఎస్‌ఐ శ్రీనివాసు పూర్తి స్థాయిలో విచారణ చేసి నిందితులైన రాఘవేందర్, కురుమూర్తి, పర్వీన్ బేగంలను అరెస్టు చేసినట్లు డీఎస్పీ తెలిపారు. సమావేశంలో సీఐ కృష్ణయ్య, పాన్‌గల్ ఎస్‌ఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

రేవల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో తాళం వేసి ఉన్న ఇంట్లో చోరీ జరిగింది. ఎస్‌ఐ రాము తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. రేవల్లికి చెందిన అన్నలదాసు లక్ష్మి, మాసయ్య భార్యాభర్తలు, వీరికి ముగ్గురు కుమార్తెలు, వీరిలో పెద్ద కుమార్తెకు వివాహమవగా.. ఇద్దరు కుమార్తెలు హైదరాబాద్‌లో చదువుకుంటున్నారు. గురువారం మాసయ్య తెల్కపల్లిలో వారి బంధువుల పెళ్లికి వెళ్లగా... లక్ష్మి పాన్‌గల్ మండలం రేమద్దుల గ్రామంలో దర్గా దగ్గరికి వెళ్లింది. ఆ సమయంలో తాళం చెవిని బాత్రూంలోని టూత్ బ్రష్ డబ్బాలో వేసింది. తిరిగి ఇంటికి వచ్చి చూడగా.. బీరువాలోని ఇద్దరి కుమార్తెల నాను, మొత్తం 35 తులాల వెండి గొలుసులు, మూడు మాసాల బంగారు ఉంగరం కనిపించలేదు. ఈ విషయంపై శుక్రవారం పోలీస్ స్టేషన్‌లో లక్ష్మి ఫిర్యాదు చేసింది. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

16న ఏకలవ్య మోడల్‌స్కూల్ ప్రవేశ పరీక్ష

వెల్దండ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని గుండాల ఏకవల్య మోడల్ స్కూల్‌లో ఈనెల 16న ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ పార్థీప్ కుమార్ తెలిపారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు టీఎస్‌ఈఎంఆర్‌ఎస్ తెలంగాణ వెబ్‌సైట్‌లో హాల్‌టికెట్లు అందుబాటులో ఉన్నాయని పేర్కొన్నారు. ఉదయం 10.30 నిమిషాల నుండి 12.30 వరకు ప్రవేశపరీక్ష నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.



పెట్రోల్ బంక్‌లో వాహనాలకు పెట్రోల్, డీజిల్ పోస్తున్న మహిళ

దేశంలోనే తొలి మహిళా పెట్రోల్ బంకు

- నారాయణపేట జిల్లా కేంద్రంలో ఏర్పాటు
- జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహణ
- గతనెల 21న ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి
- రోజూ 2 వేల లీటర్ల పెట్రోలు, 1800 లీటర్ల డీజిల్ విక్రయం



బంక్‌లో రోజు వారీ నగదు లెక్కింపులో మహిళలు

నారాయణపేట, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : దేశంలోనే మొట్టమొదటి మహిళా పెట్రోల్ బంకు నారాయణ జిల్లా కేంద్రంలో విజయవంతంగా కొనసాగుతోంది. పట్టణం లోని సంగారం చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఈ బంకును గతనెల 21న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ సహకారంతో, జిల్లా మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో దీనిని నిర్వహి స్తున్నారు. నారాయణపేట జిల్లా వ్యాప్తంగా 11 మండల మహిళా సమాఖ్యలు, గ్రామైక్య సంఘాలు 353, పొదుపు సంఘాలు 8,196 ఉన్నాయి. వాటిల్లో 93,892 మంది మహిళలు సభ్యులుగా ఉన్నారు. స్వయం సహాయ సంఘాల్లో సభ్యులైన మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగా ఇందిరా మహిళా శక్తి పథకం కింద పలు యూనిట్లను నెలకొల్పుతున్నారు. ఈ పథకం ద్వారా దేశంలోనే తొలిసారి మహిళా పెట్రోలు బంకు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. అందుకోసం నారాయణపేట నాటి, నేటి కలెక్టర్లు కోయశ్రీహర్ష, సిక్తా పట్నాయక్, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి సింగారం చౌరస్తాలో 300 గజాల ప్రభుత్వ స్థలాన్ని కేటాయించి, పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకున్నారు. బంకు నిర్వహణ కోసం జిల్లా మహిళా సమాఖ్యకు గత ఏడాది సెప్టెంబరులోనే 20 సంవత్సరాల పాటు ఒప్పందం కుదిరింది. భారత్ పెట్రోలియం యజమాన్యం రూ.1.10 కోట్ల వ్యయంతో భారత్ పెట్రోల్ బంకు ఏర్పాటు చేసింది. మిలిగిన చిన్న పనులతో పాటు డీజిల్, పెట్రోల్ కొనుగోలుకు జిల్లా మహిళా సమాఖ్య నుంచి రూ.35 లక్షలు ఖర్చు చేశారు. జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు బంకును నిర్వహిస్తున్నారు. ప్రతీ రోజు 2 వేల లీటర్ల పెట్రోలు, 1,800 లీటర్ల డీజిల్ విక్రయిస్తూ, రూ. 3.50 లక్షల కలెక్షన్లతో మహిళలు విజయవంతంగా వ్యాపారం కొనసాగిస్తున్నారు.

పెట్రోల్, డీజిల్ పోస్తున్నా..



సింగారం మహిళా సంఘంలో సభ్యురాలినైన నేను వాహనాల్లో పెట్రోల్, డీజిల్ పోస్తున్నాను. ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు విధులు నిర్వరిస్తున్నాను. ప్రతి నెల రూ. 11 వేల వేతనం పొందుతున్నాను. విధి నిర్వహణ కోసం 15 రోజుల పాటు శిక్షణ పొందాను. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, కలెక్టర్ సిక్తా పట్నాయక్‌ల చొరవతో పెట్రోల్ బంకును ఏర్పాటు చేసి మహిళలకు ఉపాధి కల్పించడం సంతోషంగా ఉంది.

- అశ్విని, సింగారం మహిళా సంఘం సభ్యురాలు

ముఖ్యమంత్రికి రుణపడి ఉంటాం



పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేసి ఉపాధి కల్పించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే చిట్టెం పర్ణికారెడ్డి, నాటి నేటి కలెక్టర్లు కోయశ్రీహర్ష, సిక్తా పట్నాయక్‌లకు జిల్లా మహిళా సమాఖ్య రుణపడి ఉంటుంది. ఇంధన వ్యాపారం చేస్తామని మేము ఏనాడూ ఊహించలేదు. నేను మేనేజర్‌గా వ్యవహరిస్తూ ముగ్గురు మహిళా సంఘం సభ్యులు వాహనాలకు ఇంధనం వేస్తున్నారు. ప్రతీ నెల మూడు లక్షల రూపాయల వరకు అదాయం వస్తుంది. ఇందులో జీతభత్యాలతో పాటు నిర్వహణ ఖర్చులు పోను లక్షన్నర రూపాయలు ఆదాయం వచ్చే అవకాశం ఉంది.

- చంద్రకళ, బంకు మేనేజర్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు

మహిళలు స్వశక్తితో ఎదగాలి

- అందుకు అవకాశాలు కల్పిస్తున్నాం
- నారాయణపేట కలెక్టర్ సిక్తాపట్నాయక్



నారాయణపేట టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : వెనుకబడిన నారాయణపేట జిల్లాలో, దేశంలోనే తొలిసారి జిల్లా మహిళా సమాఖ్యకు పెట్రోల్ బంకును మంజూరు చేయించామని నారాయణపేట జిల్లా కలెక్టర్ సిక్తా పాట్నాయక్ అన్నారు. మహిళ సంఘాలు స్వశక్తితో ఎదిగేలా ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నామని తెలిపారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో ఆమె తెలిపిన వివరాలు..

మీ కుటుంబ నేపథ్యం..

మా సొంత రాష్ట్రం ఒడిశా అయినప్పటికీ, నాన్న ఉద్యోగరీత్యా ఢిల్లీలో ఉంటున్నాం. మా నాన్న ఏకే పట్నాయక్ ఇండియన్ ఆడిట్ డిపార్ట్‌మెంట్‌లో విధులు నిర్వర్తిస్తున్నారు. అమ్మ మంజుశ్రీ ఉపాధ్యాయురాలు. చెల్లెలు అర్పిత పీహెచ్‌డీ ఎకనామిక్స్ పూర్తి చేసి, అమెరికాలో ఉంటున్నారు. నా విద్యాభ్యాసం ఢిల్లీలోనే జరిగింది. ఎంఏ ఎకనామిక్స్ చేసి ప్రైవేటు సెక్టార్‌లో సంవత్సరం పాటు విధులు నిర్వర్తించాను. ఉద్యోగం చేస్తూనే యూపీఎస్‌సీకి సిద్ధమై ఐఏఎస్ సాధించాను.

మహిళా సాధికారితకు చేపడుతున్న ప్రధా న కార్యక్రమాలు ఏమిటి?

జిల్లాలో మహిళా సంఘాలను బలోపేతం చేస్తున్నాం. మహిళలు స్వశక్తితో నిలబడటానికి ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. అందులో భాగంగానే జిల్లా మహిళా సమాఖ్యకు కేటాయించిన పెట్రోల్ బంకును, ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఖాతాల నిర్వహణపై మహిళా సంఘాల సభ్యులకు రెండు వారాల పాటు సెర్ప్ ఆధ్వర్యంలో శిక్షణ ఇప్పించాం. అదే విధంగా ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి కృషి చేస్తున్నాం. సెర్ప్ సీఈవో దివ్యరాజన్ సహకరి స్తున్నారు.

మహిళల ఆరోగ్యం, విద్య, ఆర్థిక స్వావలంభనకు తీసుకుంటున్న చర్యలు ఏవి?

నారాయణపేట జిల్లా పూర్తిగా వెనుకబడి ఉంది. కాబట్టి మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉన్న సమస్యలు కనిపిస్తున్నాయి. ప్రతీ వారం మహిళలకు పరీక్షలు చేయిస్తున్నాం. జిల్లా ఆసుపత్రిలో మహిళా వైద్యుల ఆధ్వర్యంలో ప్రత్యేక క్యాంపులను నిర్వహించి అవగాహన కల్పిస్తున్నాం. మహిళలు ఆర్థికాభివృద్ధి సాధించేందుకు ఎమ్మెల్యే, ఎంపీ నిధులతో ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నాం. జిల్లాలో వైద్య కళాశాల, నర్సింగ్, పారామెడికల్ కళాశాలల ఏర్పాటుతో ఉన్నత విద్యకు అవకాశాలు పెరిగాయి.

వ్యాపారం, వ్యవసాయం, ఇతర రంగాల్లో మహిళల పురోగతికి తీసుకుంటున్న చర్యలు ఏవి?

మహిళలు వ్యాపారాలు, వివిధ వృత్తుల్లో పురోగతి సాధించేలా సెర్ప్ ఆధ్వర్యంలో పలు కార్యక్రమాలు చేపడుతున్నాం. వ్యవసాయ రంగంలో ఎదిగేందుకు తగిన ప్రోత్సాహం అందిస్తున్నాం. జిల్లా అధికారులతో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నాం.

లింగ వివక్షతను అరికట్టేందుకు తీసుకుంటున్న చర్యలు ఏవి?

జిల్లాలో కలెక్టర్‌గా నేను, అధిక సంఖ్యలో మహిళా ఉద్యోగులు ఉన్నారు. కార్యాలయాల్లో ఉద్యోగినులు ప్రశాంతంగా విధులు నిర్వర్తించేలా, వారికి గౌరవం కల్పిస్తున్నాం. లింగ వివక్ష నివారణకు ఎస్పీ యోగేష్ గౌతంతో చర్చలు, సమీక్షలు నిర్వహిస్తున్నాం. ఐసీడీఎస్ సఖీ, భరోసా కేంద్రాల ద్వారా బాధిత మహిళలకు కౌన్సిలింగ్ ఇస్తూ, వారి సంరక్షణకు కృషి చేస్తున్నాం. న్యాయపరంగా పూర్తి సహకారం అందిస్తున్నాం.

ఒడిశా, తెలంగాణ మహిళల మధ్య ఉన్న తేడా ఏమిటి? మీరు ఏం గమనించారు?

ఒడిశాలోని మహిళల్లో నిరక్షరాసులు ఎక్కువగా ఉంటారు. మహిళా కార్మికులు కూడా అధిక శాతం ఉన్నారు. వారిలో చైతన్యం తక్కువ. ఇప్పుడిప్పుడే వారిలో చైతన్యం వస్తోంది. ఒడిషాలో చారిత్రాత్మక ప్రదేశాలు ఎక్కువగా ఉన్నాయి. రాష్ట్ర అభివృద్ధి చెందింది. మహిళల్లో సైతం చైతన్యం బాగా ఉంది. ఇక్కడ ఎక్కువ మంది మహిళలు చదువుకొని వృత్తి, ఉద్యోగాల్లో రాణిస్తున్నారు.

జయ జయహే మహిళా!



ఉన్నత విద్య, ఉద్యోగం, వ్యాపారం, వ్యవసాయం, క్రీడలు స్వయం ఉపాధి ఇలా ఒకటేమిటి.. అన్ని రంగాల్లో మహిళలు తమ శక్తి సామర్థ్యాలను నిరూపించుకుంటున్నారు. లక్ష్యాలను నిర్దేశించుకొని, పట్టుదలతో ముందుకు సాగుతున్న వారు కొందరు.. కష్టాలను అధిగమించి ఉన్నత స్థాయికి ఎదిగిన వారు మరికొందరు.. తమదైన శైలిలో జీవితానికి మెరుగులు దిద్దుకుంటున్న వారు ఇంకొందరు.. తమదైన శైలితో విభిన్న రంగాల్లో రాణిస్తూ ఆశించిన, నచ్చిన రంగాల్లో విజయ కేతనం ఎగురవేస్తున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా 'ఆంధ్రజ్యోతి' ప్రత్యేక కథనాలు, అభిప్రాయాలు..

గిరిజన విద్యార్థినుల కోసం.. ప్రత్యేక క్రికెట్ అకాడమీ



వనపర్తి ట్రైబల్ వెల్ఫేర్ క్రికెట్ అకాడమీలో నెట్ ప్రాక్టీస్ చేస్తున్న విద్యార్థులు

- వనపర్తి ట్రైబల్ వెల్ఫేర్ పాఠశాల కేంద్రంగా బాలికలకు శిక్షణ
- జాతీయ స్థాయి, బీసీసీఐ డొమెస్టిక్ మ్యాచుల్లో రాణిస్తున్న విద్యార్థినులు
- 50 మంది బాలికలకు శిక్షణ ఇస్తున్న ఇద్దరు క్రికెట్ కోచ్‌లు

వనపర్తి అర్బన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : సరైన ప్రోత్సాహం, శిక్షణ, ముందుకు లభించే తోడ్పాటు లభిస్తే మహిళలు, యువతులు ఏ రంగంలోనైనా రాణించగలరనడంలో సందేహం అవసరం లేదు. ప్రధానంగా విద్యార్థినులు అటు చదువుతో పాటు, ఇతర రంగాల్లో రాణించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. ఇంకాస్త మెరుగైన వసతులు కల్పించి ప్రోత్సహిస్తే వారు అద్భుత ఫలితాలు సాధించే అవకాశం ఉంది. ఏ రంగంలోనైనా రాణించడానికి చిన్నప్పటి నుంచే సరైన శిక్షణ అవసరం.. అదే లక్ష్యంగా రాష్ట్ర గిరిజన సంక్షేమ పాఠశాలల ఆధ్వర్యంలో వనపర్తి కేంద్రంగా ప్రత్యేక క్రికెట్ అకాడమీ కృషి చేస్తోంది. ఇక్కడ శిక్షణ పొందిన బాలికలు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీల్లో రాణిస్తూ పతకాలు సాధిస్తున్నారు. ముఖ్యంగా గిరిజన బాలికలకు సరైన పోషకాహారం లభించి, చదువుకోవడమే కష్టమనుకునే పరిస్థితులు ఉన్నప్పటికీ.. క్రికెట్ అకాడమీ అందిస్తున్న శిక్షణతో రాణిస్తుండటం తమకు గర్వంగా ఉందంటున్నారు కోచ్‌లు..

5వ తరగతి నుంచే...

ట్రైబల్ వెల్ఫేర్ శాఖ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా గురుకుల పాఠశాలలతో పాటు.. జూనియర్, డిగ్రీ కళాశాలలను నిర్వహిస్తున్నారు. వారంతా చదువులో రాణిస్తుండటంతో పాటు క్రీడల్లోనూ రాణించాలనే ఉద్దేశంలో పలుచోట్ల ప్రత్యేక అకాడమీలు ఏర్పాటు చేస్తున్నారు. వనపర్తిలో ఏర్పాటు చేసిన క్రికెట్ అకాడమీలో 5వ తరగతి నుంచి మొదలుకుని డిగ్రీ వరకు బాలికలు, మహిళలు శిక్షణ పొందుతున్నారు. ప్రస్తుతం 50 మంది విద్యార్థినులు ఉండగా.. ఏడేళ్ల నుంచి శిక్షణ ఇస్తున్నారు. రాష్ట్రంలోని గిరిజన బాలికల విద్యాలయాల్లో చదువుకునే పిల్లలు ఇక్కడ శిక్షణ పొందుతున్నారు. పరీక్షలు, ప్రత్యేక తరగతులు ఉన్నప్పుడు సొంత విద్యాలయాలకు వెళ్తారు. మిగతా సమయాల్లో ఇక్కడే శిక్షణ పొందుతారు. ఉదయం 3 గంటలు, సాయంత్రం 3 గంటల చొప్పున ప్రతీ రోజు ఆరు గంటల పాటు వీరికి శిక్షణ ఉంటుంది. కోచ్‌లు ఎంఏ మన్నాన్, ఝాన్సీలక్ష్మి శిక్షణ ఇస్తున్నారు. ఒక క్యూరేటర్, ఒక గ్రౌండ్ మెన్ సేవలందిస్తున్నారు. విద్యాలయం ప్రిన్సిపాల్ ఎన్. సరస్వతి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు.

జాతీయస్థాయికి 30 మంది...

ఈ క్రికెట్ అకాడమీ ద్వారా 2018 నుంచి ఇప్పటి వరకు 30 మందికి పైగా బాలికలు జాతీయ స్థాయి క్రీడల్లో పాల్గొన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్, బీసీసీఐ డొమెస్టిక్ మ్యాచులు, సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రీడా పోటీల్లో ప్రతిభ చాటుకున్నారు. ఇక్కడ శిక్షణ పొందుతున్న విద్యార్థినులు కాకతీయ యూనివర్సిటీ, పాలమూరు యూనివర్సిటీ జట్లకు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. పీయూ జట్టులో మెజారిటీ క్రీడాకారులు ఈ అకాడమీ నుంచే ఉన్నారు. 2023-2024లో అండర్-19లో రెండో స్థానం, అలాగే అండర్-17లో రెండో స్థానాన్ని సొంతం చేసుకున్నారు. ఈ రెండు జట్ల నుంచి అయిదుగురు క్రీడాకారులు జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. బీసీసీఐ డొమెస్టిక్ మ్యాచుల కోసం అయిదుగురు ఎంపిక కాగా.. అందులో పార్వతి, మొంజుల, రజిత, లావణ్య, అనిత ఉన్నారు. పీయూ జట్టుకు మంజుల కెప్టెన్‌గా ఉన్నారు.

జాతీయస్థాయిలో రాణించడం గర్వంగా ఉంది..



నేను ఇప్పటి వరకు జాతీయ మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన ఎస్‌జీఎఫ్ క్రీడా పోటీల్లో పాల్గొన్నాను. మధ్య ప్రదేశ్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ టెన్నిస్ బాల్ పోటీల్లో పాల్గొన్నాను. అండర్-19 విభాగంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ తరఫున రాజ్‌కోట్, రాంచీల్లో జరిగిన మ్యాచుల్లో పాల్గొన్నాను. గిరిజన కుటుంబంలో పుట్టిన నేను జాతీయ స్థాయి పోటీల్లో రాణించడం గర్వంగా ఉంది. రంజి, నేషనల్ జట్లలో చోటు సంపాదించడమే లక్ష్యంగా శిక్షణ తీసుకుంటున్నాను.

కె. రజిత క్రికెటర్, వనపర్తి ట్రైబల్ వెల్ఫేర్ క్రికెట్ అకాడమీ

మంచి శిక్షణ ఇస్తున్నారు



లావణ్య, క్రికెటర్, వనపర్తి ట్రైబల్ వెల్ఫేర్ క్రికెట్ అకాడమీ : మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరు. అటు క్రీడల్లో, ఇటు చదువులోనూ రాణించగలుగుతారు. నేను అండర్ 17 విభాగంలో ఆదిలాబాద్, నిజామాబాద్, హైదరాబాద్, గద్వాల్ సూపర్-7లో పాల్గొన్నాను. గుజరాత్‌లో జరిగిన ఎస్‌జీఎఫ్ జాతీయ క్రీడా పోటీల్లో పాల్గొన్నాను. బెంగుళూరులో జరిగిన యూనివర్సిటీ క్రీడలు, మధ్యప్రదేశ్‌లో నిర్వహించిన బీసీసీఐ డొమెస్టిక్ మ్యాచుల్లో పాల్గొన్నాను. కోచ్‌లు మన్నాన్, ఝాన్సీలక్ష్మి మంచి శిక్షణ ఇవ్వడంతో మేమంతా క్రికెట్‌లో రాణిస్తున్నాం.

గర్వపడేలా చేస్తున్నారు..



ఝాన్సీలక్ష్మి, కోచ్, వనపర్తి ట్రైబల్ వెల్ఫేర్ క్రికెట్ అకాడమీ : వనపర్తి ట్రైబల్ వెల్ఫేర్ క్రికెట్ అకాడమీలో 2018 నుంచి ఏడేళ్లుగా గిరిజన బాలికలకు క్రికెట్‌లో శిక్షణ ఇస్తున్నాం. మేము అనుకున్నట్లుగా ఇక్కడ శిక్షణ పొందుతున్న వారు రాణించి మమ్మల్ని గర్వపడేలా చేస్తున్నారు. లక్షల రూపాయలు ధార పోసి పెద్దపెద్ద ప్రైవేటు క్రికెట్ అకాడమీల్లో శిక్షణ పొందుతున్న వారి కంటే అద్భుతంగా రాణిస్తున్నారు. రంజీలు, నేషనల్ టీమ్‌లలో గిరిజన బాలికల విద్యాలయాల్లో చదువుతున్న వారిని ఎంపిక చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నాం.

మహిళామణులు క్రీడారంగంలో రాణులు

రాష్ట్ర, జాతీయ స్థాయిలో రాణిస్తున్న పాలమూరు క్రీడాకారిణులు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : నేటి సమాజంలో మహిళలు పురుషులకు దీటుగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఆటుపోట్లు ఎదురైనా విజయమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారు. వివిధ క్రీడా అంశాల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా క్రీడాకారిణులు సత్తా చాటుతున్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా జిల్లాలో వాలీబాల్, అథ్లెటిక్స్, క్రికెట్, హ్యాండ్‌బాల్, గోల్ఫ్ క్రీడల్లో రాణిస్తున్న క్రీడా రాణులపై 'ఆంధ్రజ్యోతి' కథనం...

భారత జట్టుకు ఎంపికవ్వాలి..

- గాయత్రి, శాఖాపూర్



అడ్డాకుల మండలం శాఖాపూర్‌కు చెందిన గాయత్రి హైదరాబాద్‌లోని రాజా బహదూర్ వెంకట రామిరెడ్డి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ కళాశాలలో మాస్టర్ ఆఫ్ కంప్యూటర్ అప్లికేషన్స్ (ఎంసీఏ) ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఎడవ తరగతి చదువుతున్నప్పుడు పీఈటీ జియావుద్దీన్ ప్రోత్సాహంతో హ్యాండ్‌బాల్ సాధన చేసింది. అప్పటి నుంచి పలు రాష్ట్ర, జాతీయ స్థాయి టోర్నీల్లో ఆడి సత్తా చాటుకున్నది. ఇప్పటివరకు 20కి పైగా రాష్ట్రస్థాయి టోర్నీల్లో ఆడి ప్రతిభ చాటింది. 2021లో తెలంగాణ జట్టుకు ప్రాతినిధ్యం వహించి ప్రశంసలు అందుకున్నది. సిద్దిపేట, ఉత్తరప్రదేశ్‌లో రెండు, హైదరాబాద్, రాజస్థాన్, తమిళనాడులో ఒక జాతీయస్థాయి టోర్నీలో ఆడారు. భవిష్యత్తులో భారత జట్టుకు ఆడటం, సివిల్స్ సాధించడమే తన లక్ష్యమని చెప్పారు.

జాతీయ స్థాయికి ఎదగడమే లక్ష్యం

- హారికాదేవి, అన్నాసాగర్

జాతీయ స్థాయికి ఎదగడమే తన లక్ష్యమని నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం అన్నాసాగర్‌కు చెందిన క్రీడాకారిణి హారికాదేవి అన్నారు. హరియాణాలో 2024 జూన్‌లో నిర్వహించిన ఒలింపిక్స్ ట్రాయల్స్‌లో పాల్గొన్న ఆమె కొద్దిలో అవకాశాన్ని కోల్పోయింది. 100 మీటర్ల పరుగులో తన నైపుణ్యాన్ని కనబరచినా, అవసరమైన టైమింగ్ రాకపోవడంతో అవకాశం చేజారింది. ప్రస్తుతం నారాయణపేటలో అథ్లెటిక్స్ ఖేలో ఇండియా కేంద్రంలో చిన్నారులకు శిక్షణ ఇస్తోంది. ఇప్పటి వరకు 48 జాతీయ స్థాయి టోర్నీల్లో పాల్గొన్న ఆమె 18 పతకాలు సాధించింది. వాటిలో 8 బంగారు పతకాలు ఉండటం విశేషం. దాదాపు 90 వరకు రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ 100మీటర్లు, 200 మీటర్ల పరుగు పందెంలో పాల్గొన్నది. భవిష్యత్తులో కామన్ వెల్త్ పోటీల్లో పాల్గొని దేశానికి పతకం సాధించడమే లక్ష్యంగా పెట్టుకుంది.

వాలీబాల్ టోర్నీలో సత్తా చాటిన అనన్యశ్రీ



ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని మక్తల్‌కు చెందిన అనన్యశ్రీ వాలీబాల్ ఆటలో సత్తాచాటింది. గత ఏడాది ఆగస్టులో చైనాలో నిర్వహించిన వరల్డ్ వాలీబాల్ యూనివర్సిటీ టోర్నీలో పాల్గొనే ఆలిండియా యూనివర్సిటీ జట్టుకు ప్రాతి నిధ్య వహించింది. కేరళ యూనివర్సిటీలో బీకాం పూర్తి చేసింది. 2018లో పంజాబ్, 2019లో తమిళనాడు, 2020లో ఆంధ్రప్రదేశ్, 2022లో ఉత్తరాఖండ్, మహారాష్ట్రలలో నిర్వహించిన జాతీయస్థాయి వాలీబాల్ జూనియర్ టోర్నీల్లో కేరళ జట్టు తరుపున ప్రతిభ చాటింది. 2023లో అస్సాంలో నిర్వహించిన సీనియర్ వాలీబాల్ నేషనల్ టోర్నీ, పాండిచ్చేరిలో నిర్వహించిన ఫెడరేషన్ కప్‌లో ప్రతిభ చాటి చైనాలో ఆగస్టులో నిర్వహించిన వరల్డ్ వాలీబాల్ యూనివర్సిటీ టోర్నీలో పాల్గొనే ఆలిండియా యూనివర్సిటీ జట్టుకు ఎంపికైంది. 2024లో జనవరిలో నిర్వహించిన ఆల్‌ఇండియా ఉమెన్స్ ఇంటర్ యూనివర్సిటీ టోర్నీలో పాల్గొని బంగారు పతకం సాధించింది. బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్రలో ఉద్యోగం సాధించిన ఆమె పూణెలో క్లర్క్‌గా పనిచేస్తున్నారు.

జట్టు విజయంలో కీలక పాత్ర

- అనిత, చింతగట్టు తండా



నారాయణపేట జిల్లా, కోస్గి మండలం, చింతగట్టు తండాకు చెందిన అనిత మహబూబ్‌నగర్ గిరిజన గురుకుల డిగ్రీ కళాశాలలో బీకాం రెండో సంవత్సరం చదువుతోంది. వనపర్తి క్రికెట్ అకాడమీకి ఎంపికై కోచ్ మన్నాన్ ప్రోత్సాహంతో క్రికెట్‌లో రాణిస్తోంది. హెచ్‌సీఏ 2022లో సూరత్‌లో నిర్వహించిన వన్డే టోర్నీలో, 2023లో బెంగళూరు, పుదుచ్చేరిలలో నిర్వహించిన జాతీయ స్థాయి టోర్నీలో పాల్గొన్నది. 2019లో మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన అండర్-19 సూపర్ సెవెన్ క్రికెట్ టోర్నీలో జట్టు స్వర్ణ పతకం సాధించడంలో తన వంతు పాత్ర పోషించింది. జట్టులో బౌలర్‌గా 40 పైగా వికెట్లు తీసి సత్తా చాటింది. భవిష్యత్తు భారత జట్టుకు ఆడాలన్నదే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు తెలిపింది.

అంతర్జాతీయ స్థాయికి ఎదగాలి

- అనూష, నంచర్ల



అంతర్జాతీయ స్థాయికి ఆడటమే తన లక్ష్యమని మహబూబ్‌నగర్ జిల్లా, రూరల్ మండలంలోని ఫతేపూర్ గ్రామానికి చెందిన క్రీడాకారిణి అనూష చెప్తోంది. మహ్మదాబాద్ మండలం, నంచర్లలోని సాంఘిక సంక్షేమ గురుకుల కళాశాలలో ఇంటర్ ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతోంది. సాంఘిక సంక్షేమ గురుకులాల ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని గౌలిదొడ్డిలో ఏర్పాటు చేసిన గోల్ఫ్ అకాడమీకి 2019లో ఎంపికయ్యింది. ఆర్థిక స్తోమత ఉన్న వారే ఆడే ఈ క్రీడలో పేద కుటుంబానికి చెందిన ఆమె రాణిస్తోంది. విశాఖపట్టణంలో జరిగిన ఐజీయూ సౌత్‌జోన్ జూనియర్ గోల్ఫ్ చాంపియన్‌షిప్ పోటీలో అనూష సి-కేటగిరీ రెండు రౌండ్లలో ప్రతిభ చాటి 28, 24 స్కోర్ సాధించి రతజ పతకం సాధించింది. బెంగళూరు, మైసూర్, కోయంబత్తూర్‌లలో జరిగిన సౌత్‌జోన్ టోర్నీలో పాల్గొన్నది. 2019 నుంచి 2025వ వరకు నిర్వహించిన వివిధ టోర్నీల్లో 21 పతకాలు సాధించింది. 4 స్వర్ణ, 9 కాంస్య, 8 రజత పతకాలను సొంతం చేసుకున్నది. తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాల వ్యాయామ సంచాలకులు రామ్‌లక్ష్మణ్ ప్రోత్సాహంతో ముందుకు సాగుతోంది. కోచ్ భాస్కర్ పర్యవేక్షణలో శిక్షణ పొందుతోంది.

చదువుతోనే సమానత్వం

ఏ.శ్రీదేవి, సీనియర్ న్యాయాధికారి, కల్వకుర్తి



కల్వకుర్తి, మార్చి 6 (ఆంధ్రజ్యోతి) : చదువుతోనే మహిళా సమానత్వం సాధ్యం అవుతుంది. విద్యార్థినులు సెల్ ఫోన్‌లకు దూరంగా ఉండి 10, ఇంటర్‌లలో మంచి మార్కు లతో ఉత్తీర్ణత సాధిస్తే జీవితానికి టర్నింగ్ పాయింట్ అవుతుంది. లక్ష్యం కోసం కష్టపడితేనే అనుకున్న రంగంలో రాణించి ఆర్థిక పరిపుష్టి సాధించగలుగుతారు. చెంచు పెంటల్లో విద్యా ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాం. ప్రస్తుత సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. మరింతగా రాణించాల్సిన అవసరం ఉంది.

కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉండాలి



జె.కావ్య, జూనియర్ సివిల్ న్యాయాధికారి, కల్వకుర్తి : మహిళలకు కుటుంబ సభ్యుల ప్రోత్సాహం ఉండాలి. తమపై తమకు నమ్మకం ఉంచుకొని, కష్టపడితేనే ఏదైనా సాధించగలరు. ఆడపిల్లలను మగ పిల్లలతో సమానంగా చూడాలి. వారు ఎంత వరకు చదువుకుంటే తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు వారిని అంత వరకు చదివించాలి. కష్టపడితే ఏ రంగంలోనైనా రాణించగలరు. మహిళలం దరూ ఆర్థికంగా రాణించి కుటుంబ పోషణలో భాగస్వాములు కావాలి.

ఆడపిల్ల అంటే ఆదిశక్తి



సి.భాగ్యమ్మ, సీడీపీవో, కల్వకుర్తి : ఆడపిల్ల అంటే ఆదిశక్తి. తమ కాళ్లపై తాము నిలబడాలంటే కేవలం చదువుతోనే సాధ్యం. ప్రస్తుతం పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబంలో ఆడ పిల్లను తక్కువగా చూడకుండా మగ పిల్లలతో సమానంగా చూడాలి. బాల్యవివాహాలను అరికట్టాలి. ఆడ పిల్లలపై వివక్ష చూపొద్దు. నాకు రెండు సంవత్సరాల బయసులోనే నాన్న చనిపోయారు. తల్లి రాములమ్మ కష్టపడి నన్ను చదివించింది. అమ్మ, భర్త స్ఫూర్తితో ఎంఏ వరకు చదివాను. అంగన్‌వాడీ కార్యకర్త నుంచి సీడీపీవోగా ఎదిగాను.

న్యూస్ బాక్స్

విద్యార్థులే ఉపాధ్యాయులైన వేళ



స్వయంపాలనలో పాల్గొన్న విద్యార్థులు

వడ్డేపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమరుసు గ్రామంలోని ఎంపీయూపీఎస్ పాఠశాలలో శుక్రవారం స్వయం పరిపాలన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు అధికారులుగా, ఉపాధ్యాయులుగా మారి బోధన చేయడం, ఉన్నతాధికారులుగా వ్యవహరించి ఆకట్టుకున్నారు. హెడ్ మాస్టర్‌గా రవీంద్రస్వామి, ఉపాధ్యాయులుగా కృష్ణనాయక్, అయ్యన్న, విష్ణువర్ధన్, ఉశన్న, మధు వ్యవహరించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్‌పర్సన్ కె.జానకమ్మ, ఉపాధ్యాయులు ఉన్నారు.

నీటి సమస్య రాకుండా పరిష్కరించాలి

అలంపూర్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మండలంలోని క్యాతూరులో 12 ప్రభుత్వ బోర్ల ద్వారా పలువీధులలో 32 మినీ వాటర్ ట్యాంకులు, నీటి కుళాయిలకు ఒకే పైపు లైను కనెక్షన్ ఇవ్వడం వలన గ్రామంలోని పై కాలనీలలో ఉన్న వాటర్‌ట్యాంకులకు నీరు ఓవర్‌ఫుల్ అయి నీరు వృధా అవుతున్నాయి. ఈ ఎండాకాలంలో ముందుగానే భూగర్భజలాలు అడుగంటి పోవడాన్ని దృష్టిలో ఉంచుకుని నీటిని పొదుపుచేసేది పోయి అధికారులు చూసిచూడనట్లుగా వ్యవహరిస్తున్నారు. పంచాయతీ కార్యాలయం పక్కన ప్రధాన రహదారి పక్కనే ఉన్న వాటర్‌ట్యాంకులో అలాగే పశువుల వైద్యాధికారి కార్యాలయం వద్ద బిరడా లేని కొళాయిల ద్వారా నీరు వృధా అవుతుందన్నారు. గ్రామంలోని ప్రజలకు నీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై పంచాయతీ కార్యదర్శిని ఆంధ్రజ్యోతి వివరణ కోరగా గతంలో నుంచి నీరు వృధాగా అవుతుందని, ఓ మినీ వాటర్‌ట్యాంకరు నిండిన వెంటనే వాల్ బిగిస్తే పైపులైను పగిలిపోయే వీలుందన్నారు.

మట్టి టిప్పర్ల పట్టివేత

అయిజ, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అయిజలో అక్రమంగా మట్టిని తరలిస్తున్న 2 మట్టి టిప్పర్లను పట్టుకున్నట్లు రెవిన్యూ ఇన్‌స్పెక్టర్ రజనీకాంత్ తెలిపారు. అందిన సమాచారం మేరకు శుక్రవారం అయిజ పట్టణంలోని కర్నూల్, రాయచూర్ చౌరస్తా మీదుగా వెళుతున్న టిప్పర్లను ఆపి అనుమతి పత్రాలు చూయించాలని కోరగా ఎలాంటి పత్రాలు చూపకపోవటంతో టిప్పర్లను తహశీల్దార్ కార్యాలయానికి తరలించటం జరిగిందని తెలిపారు. ఆమె ఆదేశాల మేరకు టిప్పర్లను స్థానికి పోలీస్‌స్టేషన్‌కు అప్పగించినట్లు తెలిపారు. మైనింగ్ అధికారుల అనుమతులు పరిశీలించిన అనంతరం తదుపరి చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈవిషయమై మైనింగ్ అధికారి రమణను వివరణ కోరగా ఎలాంటి అనుమతులు లేవని తెలిపారు.

ఇసుక ట్రాక్టర్లు..

అలంపూరు చౌరస్తా, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఉండవల్లి మండల పరిధిలోని పుల్లూరు వైపు నుంచి అలంపూరు చౌరస్తా వైపు వస్తున్న ఓ ఇసుక ట్రాక్టరును పట్టుకున్నట్లు ఏఎస్సై సుబ్బారెడ్డి తెలిపారు. కానిస్టేబుల్స్ అబ్దుల్‌బాష, రమేష్‌లు శుక్రవారం ఉదయం బ్లూకోట్ విధుల్లో ఉండగా అనుమతులు లేకుండా తరలిస్తున్న ఇసుక ట్రాక్టరును పట్టుకునేందుకు ప్రయత్నించగా పోలీసులను గమనించిన డ్రైవర్ రమేష్ ట్రాక్టరును వదిలేసి పారిపోయాడు. దీంతో పోలీసులు వాహనాన్ని స్టేషనుకు తరలించి విచారించగా పుల్లూరుకు చెందిన ధనుంజయి గుర్తించి అనుమతులు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్లు ఏఎస్సై తెలిపారు.

పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి

- ఎంఈవో రాములు

అయిజటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పిల్లల్లో దాగిఉన్న సృజనాత్మకతను విద్యాసంస్థలు వెలికితీయాలని ఎంఈఓ రాములు అన్నారు. శుక్రవారం అయిజ పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాల నిర్వహించిన కళా మహోత్సవం కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ప్రభుత్వ, ప్రైవేటు అనే తేడా లేకుండా ప్రతి విద్యాసంస్థలో చదువుతో పాటు విద్యార్థులలో అంతర్లీనంగా దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలి

- పట్టణ బీజేపీ అధ్యక్షుడు భగత్‌రెడ్డి

అయిజటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): అయిజలోని ఆర్‌టీసీ బస్టాండ్‌లో ప్రయాణికులకు సౌకర్యాలు కల్పించాలని పట్టణ బీజేపీ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆర్‌టీసీ బస్టాండ్ పరిసరాలను పరిశీలించిన ఆయన మాట్లాడుతూ ఎండాకాలం ఎండలు మండుతున్నాయని, అయినా ఇక్కడ ప్రయాణికులకు కనీస సౌకర్యాలు లేవని మండిపడ్డారు. తాగటానికి సరిపడ నీరుకానీ, ప్రయాణాకులకు వేచిఉండేందుకు సరైన నీడ సౌకర్యం లేదన్నారు. జిల్లాలోనే గద్వాల తర్వాత అత్యధిక ఆదాయం సమకూర్చే అయిజ ఆర్‌టీసీ బస్టాండ్‌పై స్థానిక నాయకుల పట్టింపులేని తనం స్పష్టంగా కనిపిస్తుందని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు వీరేష్, రఘు, వెంకటేష్, ఈరన్న ఉన్నారు.

వనితా వాణి

రంగం ఏదైనా తమదైన శైలిలో రాణిస్తూ ఎంతోమందికి ఆదర్శంగా నిలుస్తున్నారు నేటి మహిళలు. ఉన్నత చదువులు చదివి సాఫ్ట్‌వేర్ రంగంలో, పోలీస్ శాఖ, మిలిటరీ, రాజకీయ రంగాల్లోనూ నిలదొక్కుకుంటున్నారు. ఇంటి పనులు చేసే స్థాయి నుంచి ఆకాశంలో విమానాలు నడిపే స్థాయికి ఎదిగి, ఎంతో మందిలో స్ఫూర్తిని నింపుతున్నారు. నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సమాజంలో ఎదుర్కొంటున్న సమస్యలపై పలువురు మహిళలు తమ వాణి వినిపించారు.

- గద్వాల న్యూటౌన్



● మహిళల కోసం నిలబడదాం

- బండ్ల జ్యోతి, మాజీ సర్పంచ్



మహిళల సమస్యలు పరిష్కరించేందుకు మహిళలే ముందుకు రావడం ఎంతో అవసరం. వారికి అండగా నిలబడేలా సమాజంలో ఎదగడానికి ఎన్నో అవకాశాలు ఉన్నాయి. కొంతకాలం గా రాజకీయాలలో మహిళలకు ప్రాధాన్యం పెరుగుతున్నది.ప్రజాసమస్యలపై పట్టుసాధించి, వాటిని పరిష్కరించేలా ముందుకు సాగితే ప్రజాప్రతినిధులుగా ఎదగ వచ్చు. దీనివల్ల సమాజంలో ఎక్కువ మందికి మేలు చేసే అవకాశం ఉంటుంది. గల్లీ నుంచి ఢిల్లీ దాకా ఎంతోమంది రాణిస్తూ మహిళా లోకానికి స్ఫూర్తిదాయకంగా నిలుస్తున్నారు.

● సోషల్ మీడియా విషయంలో అప్రమత్తంగా ఉండాలి

- బి. స్వాతి, ట్రైనీ ఎస్‌ఐ గద్వాల



నేడు సోషల్ మీడియా ప్రచారం తారాస్థాయికి చేరిందనడంలో ఎలాంటి సందేహాలు లేవు. మహిళలు, యువతులు సోషల్ మీడియా బారిన పడి చాలామంది తమ ప్రాణాలను కోల్పోతున్నారు. కొందరు ప్రేమ పేరుతో యువతులను పెట్టి వారి వీడియోలను మార్ఫింగ్ చేసి బ్లాక్‌మెయిల్ చేస్తున్న విషయాలు తెలిసిందే. వీటి మాయలో పడితే యువతులు, మహిళలు ఎవరికి చెప్పుకోలేక లోలోపలే కుమిలిపోతూ ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. సోషల్ మీడియాలో ఎలాంటి పోస్టులు వచ్చినా స్పందించకూడదు. ఫ్రెండ్ పేర్లతో వచ్చే రిక్వెస్ట్‌లతో జాగ్రత్తగా ఉండాలి. యువతులు చదువుపై దృష్టి సారించి ఉన్నతంగా ఎదగడంపై దృష్టి పెట్టాలి.

● మహిళలపై దాడులు పెరుగుతున్నాయి

- బందిగొల్ల తారక, ట్రైనీ ఎస్‌ఐ గద్వాల



ప్రస్తుత పరిస్థితులలో యువతులు, మహిళలు, విద్యార్థినుల పట్ల లైంగిక దాడులు విపరీతంగా పెరుగుతున్నాయి. ఇలాంటి సంఘటనలను అరికట్టాలనే ఉద్దేశంతోనే పోలీస్ శాఖలో ఉద్యోగం సాధించాను. మహిళలు తలుచుకుంటే ఏదైనా సాధించగలరు. ఆ దిశగా మహిళలు ఆలోచించాలి. అప్పుడే సమస్యల్లో చిక్కుకునే అంశాలపై దృష్టి పోదు.

● యువతుల మనోభావాలను దెబ్బతీయరాదు

- కావ్య, బీటెక్ విద్యార్థిని



ప్రస్తుత సమాజంలో షార్ట్‌ఫిల్మ్‌పై యువతకు ఎక్కువ క్రేజీ ఉన్నది. యువతుల మనోభావాలను దెబ్బతీసేలా షార్ట్‌ఫిల్మ్‌లు ఉండకూడదు. ఉన్నత చదువులు చదివి, ఆయారంగాల్లో రాణిస్తే సమాజంలో మంచిగుర్తింపు వస్తుందనే అంశాలపై, ఇప్పటికే వివిధ రంగాల్లో రాణిస్తున్న వారిపై స్ఫూర్తివంతంగా షార్ట్‌ఫిల్మ్‌లు తీయాలి. ఇబ్బంది కలిగించేలా ఉండకూడదు.

వేసవిలో తాగునీటి ఇబ్బంది లేకుండా చూడాలి

● జిల్లా అధికారుల సమీక్షలో కలెక్టర్ బీఎం సంతోష్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్

గద్వాల న్యూటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా వేసవిలో ప్రజలకు తాగునీటి ఇబ్బందులు కలుగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో మండలాల వారిగా తాగునీటి సరఫరాపై సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ...గ్రామ పంచాయతీలు, మునిసిపల్ పరిధిలో తాగునీటి సరఫరా మెరుగుపరిచేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో తాగునీటి సరఫరా ప్రభావితం కాకుండా బల్క్‌వాటర్ సప్లై, ఓహెచ్ఎస్ఆర్, సింగిల్ ఫేజ్ చేతిపంపులు, ప్రైవేట్ బోర్ వెల్స్, ట్యాంకర్లు వంటి అన్నిమార్గాలను సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని ఆదేశించారు. ఎక్కడైనా నీటికొరత ఏర్పడినట్లైతే తక్షణమే స్పందించి ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని చెప్పారు. జిల్లాలో నీటి సమస్య లేకుండా చూడాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఇంచార్జి డీపీవో నాగేం ద్రం, సంబంధిత అధికారులు ఉన్నారు.

● లక్ష్యాలను త్వరగా పూర్తి చేయాలి

జిల్లాలో ఉపాధి హామీ పనులను వేగవంతం చేసి నిర్దేశిత లక్ష్యాలను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అధికారులకు ఆదేశించారు. శుక్రవారం ఐడీవోసీ కాన్ఫరెన్స్ హాలులో ఉపాధి హామీ పనులపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకం లక్ష్యాలను వేగవంతంగా పూర్తి చేయాలని ఆదేశించారు. ఫీల్డ్‌అసిస్టెంట్లు గ్రామాలకు వెళ్లి కూలీలు ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేలా చూడాలన్నారు. ఎంపీడీవోలు గ్రామ పంచాయతీ వారిగా లేబర్ మొబిలైజేషన్ ఎక్కువగా ఉన్న, మెటీరియల్ కంపోనెంట్ అధికంగా ఉన్న పనులకు ప్రాధాన్యత ఇచ్చి ప్రణాళికాబద్ధంగా లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని సూచించారు. పనుల అమలు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా లేకుంటే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, ఇంచార్జి డీపీవో నాగేంద్రం, అధికారులు ఉన్నారు.

● దివ్యాంగులకు యూనిక్ డిజబులిటి కార్డు

దివ్యాంగుల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని దివ్యాంగునికి సదరం సర్టిఫికెట్‌కు బదులుగా యూనిక్ డిజబులిటి ఐడీ(యూడిఐడి) కార్డును కేటాయించాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఉద్యోగ, ఉపాధి, విద్య, పెన్షన్ల కోసం దేశవ్యాప్తంగా ప్రయోజనం పొందే విధంగా సదరం సర్టిఫికెట్‌కు బదులుగా యూడీఐడీ కార్డును ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం ఇవ్వాలని అధికారులకు ఆదేశించారు. ఈ కార్డు దేశవ్యాప్తంగా ఉపయోగపడుతుందన్నారు. మార్చి 2025 నుంచి 21రకాల అంగవైకల్యాలకు సంబంధించి యూడీఐడీ పోర్టల్ ద్వారా ఆన్‌లైన్ దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. సదరం బదులుగా యూడీఐడీ పోర్టల్‌లో లబ్ధిదారులు స్వయంగా, మీసేవా కేంద్రాల ద్వారా వారి పూర్తి వివరాలను నమోదు చేయాల్సి ఉంటుందన్నారు. మార్చి 1 నుంచి కొత్తగా దరఖాస్తు చేసుకునేవారు యూడీఐడీ పోర్టల్‌లో దరఖాస్తులు చేసుకోవాలని ఆయన తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగరావు, డీడబ్ల్యూవో సునంద, మెడికల్ సూపరింటెండెంట్ ఇందిర, అధికారులున్నారు.

చోరీ కేసును ఛేదించిన ఉండవల్లి పోలీసులు

- కత్తులతో బెదిరించిన కేసులో ముగ్గురి అరెస్టు



అలంపూరు సీఐ కార్యాలయం, కోదండాపురం పోలీసు స్టేషన్ ముందు నిందితులను ప్రవేశపెట్టిన సీఐ రవిబాబు, ఉండవల్లి ఎస్సై మహేష్, ఇతర పోలీసు అధికారులు

అలంపూరుచౌరస్తా, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): కత్తులతో బెదిరించి పిడిగుద్దులతో దాడి చేసి బైక్, సెల్ ఫోను, నగదు చోరీ చేసి పరారైన నిందితులను ఉండవల్లి పోలీసులు 48గంటల్లోపే పట్టుకున్నారు. వీరిని అలంపూరు సీఐ కార్యాలయం, కోదండాపురంలో విలేకరుల ముందు శుక్రవారం ప్రవేశపెట్టారు. కొర్విపాడు గ్రామానికి చెందిన ఫిలేమాన్ అనే వ్యక్తి చౌరస్తా నుంచి స్వగ్రామానికి ఈ నెల 2న వెళ్తూ మార్గమధ్యలో ఆగిన ఇతనిపై ముగ్గురు వ్యక్తులు వచ్చి కత్తులతో బెదిరించి, దాడి చేసి బైక్‌ను, రెండున్నరవేల నగదును, సెల్‌ఫోన్‌ను చోరీ చేశారు. 5న ఉండవల్లి పోలీసులకు అందిన ఫిర్యాదుతో ఎస్సై మహేష్ రంగంలోకి దిగి అలంపూరు చౌరస్తా, పుల్లూరు టోల్‌ప్లాజా వద్ద ఉన్న సీసీ ఫుటేజీని పరిశీలించారు. కర్నూలు వైపు వెళ్లిన వీరిపై నిఘా ఉంచి చాకచక్యంగా శుక్రవారం పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలో అదుపులోకి తీసుకున్నారు. స్టేషన్‌కు తీసుకువచ్చి, తమదైన శైలిలో విచారించగా నేరం ఒప్పుకున్నట్లు ఎస్సై మహేష్ తెలిపారు. బైక్, సెల్‌ఫోన్, నగదుతో పాటు వారు చోరీకి వాడిన స్కూటీ, వాడిన మొబైల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అత్యల్ప సమయంలో కేసును ఛేదించిన ఉండవల్లి ఎస్సై మహేష్‌ను, కానిస్టేబుల్ నాగేష్‌ను హుస్సేన్, రవీంద్రను సీఐ రవిబాబు అభినందించారు. రెండు రోజుల్లోనే నిందితులను పట్టుకోవడంతో స్థానికులు హర్షం వ్యక్తంచేశారు. పట్టుబడ్డ నిందితులలో ఇద్దరు 2020లో ఇటిక్యాల మండలంలో జరిగిన ఇలాంటి ఓ కేసులో నిందుతులుగా ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. పైగా వీరిపై కర్నూలు పట్టణంలో పలు చోరీ కేసులతో పాటు మర్డర్ కేసులు కూడా ఉన్నాయని పోలీసుల విచారణలో తేలింది.

కేంద్రం కుట్రను అడ్డుకుంటాం

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపాల్

ధరూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వం రైతులకు రాత పూర్వకంగా నూతన వ్యవసాయ చట్టాలను ఉపసంహరిస్తామని ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే అడ్డుకుంటామని తెలంగాణ రైతాంగ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.గోపాల్ అన్నారు. సంయుక్త కిసాన్ మోర్చా(ఎస్కేఎం) జాతీయ కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం ధరూర్ మండల కేంద్రంలో నాయకులు ధర్నా నిర్వహించారు.

కార్యక్రమంలో నాయకులు నాగరాజు, వెంకటప్ప, సీతారాములు, కిష్టన్న, కృష్ణ, తిమ్మారెడ్డి, సోమిరెడ్డి, రైతులు ఉన్నారు.

అక్రమ నిర్మాణాన్ని అడ్డుకోవాలి

● అధికారికి కాలనీవాసుల వినతి

గద్వాల టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్త హౌసింగ్ బోర్డు కాలనీలో రోడ్డుకు అడ్డంగా నిర్మిస్తున్న అక్రమ నిర్మాణాన్ని నిలిపి వేయించాలని కాలనీవాసులు డిమాండ్ చేశారు. శుక్రవారం కాలనీకి వచ్చిన వార్డు ఇన్‌చార్జి అధికారి అశ్వినికి సమస్యను వివరించారు. ఇప్పటికే దీనిపై తాము మునిసిపల్ కమిషనర్ దృష్టికి తెచ్చామని, అయినా ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదన్నారు. కాలనీ నుంచి కర్నూలు -హైదరాబాద్ ప్రధాన రహదారికి లింకుగా ఉన్న 80అడుగుల రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణం సాగుతున్నా ఇప్పటి వరకు టౌన్ ప్లానింగ్ అధికారులు స్పందించకపోవడం గర్హనీయమన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించకపోతే ప్రత్యక్ష ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు.

కాగా ప్రస్తుతం మునిసిపల్ పరి పాలన ప్రత్యేక అధికారి చేతిలో ఉన్నందున సమస్యను వారి దృష్టికి తెస్తానని వార్డు అధికా రి హామీ ఇచ్చినట్లు కాలనీవాసులు తెలిపారు.

ప్రజలకు జనరిక్ మందులపై అవగాహన కల్పించాలి

● డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప

గద్వాల న్యూటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు జనరిక్ మందులపై అవగాహన కల్పించాలని ఫార్మాసిస్టులకు డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్దప్ప సూచించారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని డీఎంహెచ్‌వో కార్యాలయంలో జన ఔషధ దినోత్సవం(మార్చి 1 నుండి 7, 2025 వరకు) గురించి ఫార్మాసిస్టులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జనరిక్ మందులు తక్కువ ధరకు లభిస్తాయని, అదేవిధంగా అన్ని మందుల దుకాణాలలో అందుబాటులో ఉంటాయన్నారు. జనరిక్ మందులలో ఉంటే ఔషధం, డోసు ఒకటేనని, ప్రజలు జనరిక్ మందులు వాడాలని, వాటికి, బ్రాండెడ్ మందులకు ఎలాంటి తేడా ఉండదన్నారు. ఈ విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. ఈ సమావేశంలో ప్రోగ్రాం అధికారి డాక్టర్లు ప్రసూనారాణి, తస్నీర్ రిజ్వానా,డాక్టర్ మాధుర్య, వైద్యసిబ్బంది మధుసూదన్‌రెడ్డి, వరలక్ష్మి, నరేంద్రబాబు ఉన్నారు.

మహిళలపై దాడుల నియంత్రణలో విఫలం

● సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ

గద్వాలటౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): సమాజంలో రోజురోజుకూ మహిళలపై జరుగుతున్న దాడులను నియంత్రించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు పద్మ ఆరోపించారు. వివక్షకు స్వస్తి పలికి అన్నిరంగాల్లో మహిళలకు సమాన అవకాశాలు కల్పించి హక్కులను కాపాడితేనే మహిళా దినోత్సవానికి సార్థకత ఉంటుందన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని సీఐటీయూ కార్యాలయంలో నిర్వహించిన మహిళల సమావేశంలో పాల్గొని ఆమె మాట్లాడారు. హక్కుల సాధన కోసం, ఓటు హక్కుకోసం, సమానపనికి సమాన వేతనం కోసం మహిళలు సాధించిన సంఘటిత పోరాట ఫలితమే అంతర్జాతీయ మహిళా దినోత్సవమన్నారు. నిజంగా శ్రామిక మహిళలు జరుపుకోవాల్సిన అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పెట్టుబడిదారి వర్గాలు హంగూ, ఆర్భాటాలతో జరుపుకోవడం అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఉన్న ప్రాముఖ్యతను పక్కదారి పట్టించడమేనన్నారు. మహిళల హక్కు కాపాడలేని, వారికి రక్షణ కల్పించలేని పాలకులకు మహిళా దినోత్సవం జరుపుకునే నైతిక అర్హత లేదన్నారు. ఈ సందర్భంగా హక్కుల రక్షణ, వివక్ష తొలగింపు, వేధింపులకు వ్యతిరేకంగా మహిళలు ప్రదర్శన నిర్వహించారు. కార్యక్రమంలో సునీత, పుష్పావతి, రాధ, లక్ష్మి, పద్మ, సారిక, అబేద, సరస్వతి ఉన్నారు.

అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలు



రామాపురంలో ఉపాధ్యాయినులను సన్మానించిన సిబ్బంది

వడ్డేపల్లి, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుత పోటీ ప్రపంచంలో పురుషులతో సమానంగా మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు దేవేందర్ రెడ్డి అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం వడ్డేపల్లి మండలం రామాపురంలోని జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలలో మహిళా ఉపాధ్యా యినీలను ఘనంగా సన్మానించారు. అనంతరం సిబ్బంది ఉపాధ్యాయినీలకు మహిళా దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది ఉన్నారు.

● ధరూరు: మండల కేంద్రంలోని శ్రీలక్ష్మి కాన్సెప్ట్ స్కూల్‌లో శుక్రవారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయినీలకు శాలువా కప్పి, మెమెంటోలు అందజేసి ఘనంగా సత్కరించారు. అనంతరం కరస్పాండెంట్ సుధాకర్ రెడ్డి మాట్లాడుతూ మహిళలు అన్నిరంగాల్లో రాణించడం శుభసూచికమన్నారు.

మహిళలు ఎందులోనూ తక్కువ కాదు



సమావేశంలో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి టి.లక్ష్మి

● ప్రిన్సిపల్ సీనియర్ సవిల్ న్యాయాధికారి టి.లక్ష్మి

గద్వాల క్రైం, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుల సమాజంలో మహిళలు పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణించాలని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఇంచార్జి కార్యదర్శి, ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ న్యాయాధికారి టి.లక్ష్మి అన్నారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లా న్యాయసేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రభుత్వ నర్సింగ్ కళాశాలలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో పోటీ పడుతూ రాణిస్తున్నారని, అనేక మంది మహిళలు రాణిస్తూ దేశంలో ఉన్నతస్థాయికి చేరుకున్నారని, వారిని స్ఫూర్తిగా తీసుకొని అభివృద్ధి చెందాలన్నారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో మహిళలు ఎందులోనూ తక్కువ లేరని, అన్ని రంగాల్లో దూసుకుపోతున్నారన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హనుమంతమ్మ, చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ రాజేందర్, సిబ్బంది ఉన్నారు.

లక్ష డప్పుల కళా ప్రదర్శనను విజయవంతం చేయాలి

● ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ రాజేష్

గద్వాల టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 13న జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న లక్ష డప్పులు-వెయ్యి గొంతుకలు మహా కళా ప్రదర్శనను విజయంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ పోగుల రాజేష్ కోరారు. ప్రదర్శనలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణ మాదిగ పాల్గొంటారన్నారు. ప్రదర్శన నిర్వహణకు సంబంధించి శుక్రవారం పట్టణంలోని పాత ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఎమ్మార్పీఎస్, అనుబంధ సంఘాల నాయకులతో కీలక సమావేశం నిర్వహించారు. జిల్లాలోని దళితులు, ఎమ్మార్పీఎస్ నాయకులు, అనుబంధ సంఘాల ప్రతినిధులు పెద్దసంఖ్యలో తరలిరావాలని కోరారు. సమావేశంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, ఎంఎస్పీ నాయకులు అయిజ రాజు, అశోక్, కన్న, ఆంజనేయులు, పరశురాం, ఏసన్న, తిమ్మన్న, కోళ్ల మహేష్, సవారన్న, బి.రాజు, రమేష్ ఉన్నారు.

మహిళా సాధికారతను అనివార్యంగా గుర్తించాలి

● ప్రిన్సిపాల్ షేక్ కలందర్ బాషా

గద్వాల టౌన్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి) : పురుషులతో సమానంగా అన్నిరంగాల్లో రాణిస్తున్న మహిళలకు సాధికారతను కల్పించడం నేటి సమాజానికి అనివార్యమని ప్రిన్సిపాల్ డాక్టర్ షేక్ కలందర్ బాషా అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం పట్టణంలోని మహారాణి ఆదిలక్ష్మీ దేవమ్మ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రిన్సిపాల్ మాట్లాడారు.

అంతర్జాతీయ మహిళా దినోత్సవానికి ఉన్న ప్రాముఖ్యతను విద్యార్థినులకు ప్రిన్సిపాల్ వివరించారు. కళాశాల ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్(సఖి) ఇన్‌చార్జి శోభారాణిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

సజావుగా కొనసాగుతున్న ఇంటర్ పరీక్షలు

గద్వాల సర్కిల్, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): ఇంటర్ పరీక్షలు జిల్లా వ్యాప్తంగా 14 కేంద్రాల్లో సజావుగా కొనసాగుతున్నాయి. శుక్రవారం జరిగిన ఇంటర్ ప్రథమ సంవత్సర ఇంగ్లీష్ పరీక్షకు అధికారులు సెట్ 'ఏ' ప్రశ్నా పత్రాన్ని ఎంపిక చేశారు. 4,211 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 4,051 మంది విద్యార్థులు హాజరైనట్టు జిల్లా పరీక్షల కన్వీనర్, డీఐఈవో హృదయరాజు తెలిపారు. వీరిలో జనరల్ 3,383 విద్యార్థులకు గాను 3,269 మంది (97 శాతం), వృత్తి విద్యా 828 విద్యార్థులకు 782 మంది (94 శాతం) విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల, ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాల, వాగ్దేవి జూనియర్ కళాశాల, మల్దకల్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలను కన్వీనర్ తనిఖీ చేశారు.

పురుగుమందుల వివరాలు ఆన్‌లైన్‌లో ఉంచాలి



డీలర్ల శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయ అధికారి సక్రియా నాయక్

గద్వాల, మార్చి 7(ఆంధ్రజ్యోతి): ఫర్టిలైజర్, పెస్టిసైడ్స్ అమ్మే డీలర్లు, వ్యాపారులు తప్పనిసరిగా వాటి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ తెలిపారు. శుక్రవారం వ్యవసాయ కార్యాలయంలో డీలర్లకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా జిల్లా అధికారి సక్రియనాయక్ మాట్లాడుతూ.. ఇప్పటి వరకు ఫర్టిలైజర్స్ మాత్రమే రికార్డుతో పాటు ఆన్‌లైన్‌లో నమోదులు చేసేవారమని ఇప్పుడు పురుగు మందులను కూడా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచించారు. స్టాక్ వివరాలతో పాటు రైతులకు విక్రయించిన వెంటనే ఆ వివరాలను ఆన్‌లైన్‌లో నమోదుచేయాలని సూచించారు. అలాగే రైతులకు తప్పనిసరిగా రశీదు ఇవ్వాలన్నారు. షాపు ముందు స్టాక్ వివరాలను ధరలను పొందుపరుచు పట్టిక ఉండాలని సూచించారు. వీటిని డీలర్లు, వ్యాపారులు పాటించకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో ఏవోలు, డీలర్లు పాల్గొన్నారు.